షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 334 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 20 అక్టోబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 334 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 20 October 2024 PAGES : 8 PRICE : 5/-

# 420లకు నా విజన్ అర్థంకాదు



- అమరావతి రాజధాని నిర్మాణం 2.0 ప్రారంభం
- సీఆర్డీయే కార్యాలయ పనులకు ప్రారంభోత్సవం చేసిన చంద్రబాబు
- అమరావతికి లక్ష కోట్లు ఖర్చవుతుందని తప్పుడు ప్రచారం చేశారంటూ ఆగ్రహం
- అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంటుంది...
- 2022లో చేసిన ట్వీట్ ను రిపోస్ట్ చేసిన చంద్రబాబు
- నేడు అమరావతి పనులు పునఃప్రారంభం
- పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ
- జరగాలని ఉంటే జరిగి తీరుతుందంటూ చంద్రబాబు ట్వీట్

**అమరావతి**

గత ఐదేళ్లుగా మూలనపడిన రాజధాని అమరావతి పనులు నేడు మళ్లీ పట్టాలెక్కాయి. సీఆర్డీయే కార్యాలయ పనులకు ప్రారంభోత్సవం చేయడం ద్వారా సీఎం చంద్రబాబు అమరావతి పునర్ నిర్మాణానికి నేడు తెరలేపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమరావతి రాజధానికి మళ్లీ ప్రాణప్రతిష్ఠ చేశామని వెల్లడించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం 2047 విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నామని వెల్లడించారు. 2000 సంవత్సరం కంటే ముందు విజన్ 2020 అంటే ఎగతాళి చేసి 420 అన్నారు... కానీ విమర్శించిన వాళ్లే 420 లు అయ్యారని ఎద్దేవా చేశారు. "నా విజన్ ఏంటో 420 లకు అర్థం కాదు... తెలీదు. ప్రపంచంలోనే తెలుగువారు అగ్రగామిగా ఉండాలన్నది నా ధ్యేయం. మీ ఆదాయాలు పెంచుతాం. ప్రతి ఇంటి నుండి ఒక పారిశ్రామిక వేత్త రావాలి. ఒకప్పుడు థింక్ గ్లోబల్...యాక్ట్ లోకల్ అనే నినాదం - మిగతా3లో




## నవంబర్ 2న మెగా డీఎస్సీ నోటిఫికేషన్

- ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నిరుద్యోగుల నిరీక్షణకు ఎట్టకేలకు తెర పడనుంది.
- ఈ డీఎస్సీ ప్రకటన ద్వారా మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఇప్పటికే కూటమి సర్కార్
- ప్రస్తుతం జరుగుతున్న 'టెట్' ఆన్‌లైన్ పరీక్షలు అక్టోబర్ 21వ తేదీతో ముగుస్తాయి.

**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్ మెగా డీఎస్సీ 2024 నోటిఫికేషన్ మరో 10 రోజుల్లో వచ్చేస్తుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నిరుద్యోగుల నిరీక్షణకు ఎట్టకేలకు తెర పడనుంది. నవంబరు 3వ తేదీన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ డీఎస్సీ ప్రకటన ద్వారా మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఇప్పటికే కూటమి సర్కార్ ప్రకటించింది కూడా. ప్రస్తుతం - మిగతా3లో



## రష్యాకు ప్రధాని మోడీ

- ఈనెల 22, 23 తేదీల్లో కజాన్ వేదికగా 16వ బ్రిక్స్ సమ్మిట్
- ఈ సందర్భంగా మోదీని స్వయంగా పుతిన్ ఆహ్వానించినట్లు తెలుస్తోంది
- రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానం మేరకు మోదీ ఆ దేశానికి కదలనున్నారు
- ఇక గడిచిన నాలుగు నెలల్లో ప్రధాని నరేంద్ర మోదీ రష్యాకు వెళ్లడం ఇది రెండోసారి

## లంచం అనే పదం వినిపించొద్దు

- పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు
- తొలిసారిగా పంచాయతీరాజ్ వ్యవస్థలో రూపాయి లంచం లేకుండా, రికమండేషన్ లేకుండా బదిలీలు చేశామని
- రాష్ట్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పూర్తి పారదర్శకతతో ఈ బదిలీలు జరిగాయి
- మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సుల నేపథ్యంలో రూల్ బుక్ ఏం చెబుతుందో అదే వివరిస్తున్నాం
- కొన్ని బదిలీలు రూల్స్‌కు వ్యతిరేకంగా ఉన్న వాటిని నిలిపివేశాం



**అమరావతి**

2 లంచం అనే పదం వినిపించొద్దని... అలాంటి అధికారులు, వ్యక్తులు తన వద్ద ఉండొద్దని స్పష్టంగా చెప్పానని ఏపీ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అన్నారు. తొలిసారిగా పంచాయతీరాజ్ వ్యవస్థలో రూపాయి లంచం లేకుండా, రికమండేషన్ లేకుండా బదిలీలు చేశామని స్పష్టం చేశారు. రాష్ట్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పూర్తి పారదర్శకతతో ఈ బదిలీలు జరిగాయని వివరించారు. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సుల నేపథ్యంలో రూల్ బుక్ ఏం చెబుతుందో అదే వివరిస్తున్నామని అన్నారు. కొన్ని బదిలీలు రూల్స్‌కు వ్యతిరేకంగా ఉన్న వాటిని నిలిపివేశామని పవన్ కళ్యాణ్ తెలిపారు. - మిగతా3లో



## ప్రకృతిని కాపాడటం ప్రతి పౌరుడి కర్తవ్యం

- సీజేఐ చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు..
- వాతావరణ మార్పులు అందరిపై ప్రభావం చూపుతున్నాయి
- సీజేఐ జస్టిస్ చంద్రచూడ్
- ట్రెడిషనల్ ట్రీస్ ఆఫ్ ఇండియా' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీజేఐ
- పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వంతో ప్రజలు కలిసి పని చేయాలని వ్యాఖ్య

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు



- వైసీపీ హయాంలో సొంత ప్రయోజనాల కోసం 700 కోట్లు ఖర్చు చేసి రుషి కొండపై నిర్మాణాలు చేపట్టారు
- రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే జగన్ ఓర్వలేకపోతున్నారు
- ఎన్ని అడ్డంకులు వచ్చినా లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ
- గత ఐదేళ్లలో వైసీపీ విధ్వంసం సృష్టించింది
- పెట్టుబడుల ప్రోత్సాహకం, సమస్యల పరిష్కారానికి ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేస్తున్నాం

**విశాఖపట్టణం**

ఎన్డీఏ కూటమి అధికారంలో ఉన్నంత కాలం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని మంత్రి నారా లోకేష్ తేల్చి చెప్పారు. వైసీపీ హయాంలో సొంత ప్రయోజనాల కోసం 700 కోట్లు ఖర్చు చేసి రుషి కొండపై నిర్మాణాలు చేపట్టారని మండిపడ్డారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే జగన్ ఓర్వలేకపోతున్నారని అన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్లలో వైసీపీ విధ్వంసం సృష్టించిందన్నారు లోకేష్.ఓ ఛానల్ పై పరువునష్టం దావా కేసులో విశాఖ కోర్టుకు లోకేష్ హాజరయ్యారు. ఈ కేసును నవంబర్ 15కి వాయిదా వేశారు. పరువునష్టం కేసు గెలుస్తామని.. సదరు మీడియాపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విశాఖ ఐటీ ప్రగతిలో టీసీఎస్ కీలక పాత్ర పోషించనుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. త్వరలోనే పలు కొత్త కంపెనీలు రానున్నాయన్నారు. పెట్టుబడుల ప్రోత్సాహకం, సమస్యల పరిష్కారానికి ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేస్తున్నామని లోకేష్ తెలిపారు. - మిగతా3లో

## మద్యం, ఇసుక దోపిడీపై జగన్ మాటలు హాస్యాస్పదం

- జగన్ కల్తీ మద్యం వల్ల 50 లక్షల మంది లివర్, కిడ్నీ సమస్యలకు గురయ్యారు
- జగన్ వ్యాఖ్యలకు కొల్లు రవీంద్ర కౌంటర్
- ఆదాయం పోయిందన్న బాధతో జగన్ దిక్కుమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారని ఫైర్
- తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలు సహించరని స్పష్టీకరణ

**అమరావతి**

ఏపీ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాజీ సీఎం జగన్ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ కల్తీ మద్యం వల్ల 50 లక్షల మంది లివర్, కిడ్నీ సమస్యలకు గురయ్యారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖను నిర్వీర్యం చేశారని, సెబ్ పేరుతో అక్రమ మద్యం వ్యాపారానికి బాటలు వేసుకున్నారని విమర్శించారు. వ్యవస్థలను దారుణంగా - మిగతా3లో



# నవంబర్ 2న మెగా డీఎస్సీ నోటిఫికేషన్

-మొదటిపేజీ తరువాయి

జరుగుతున్న 'టెట్' ఆన్‌లైన్ పరీక్షలు అక్టోబర్ 21వ తేదీతో ముగుస్తాయి. అనంతరం టెట్ ఫలితాలను నవంబరు 2న ప్రకటిస్తారు. మెగా డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్ (రాఉ) పోస్టులు 6,371, స్కూల్ అసిస్టెంట్ టీచర్ (రాం) పోస్టులు 7,725, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (ఁఉ) పోస్టులు1,781, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (ఖఉ) పోస్టులు 286, ప్రిన్సిపాల్ పోస్టులు 52, వ్యాయామ ఉపాధ్యాయుల (ఖఖ) పోస్టులు 132 వరకు ఉన్నాయి. ఇక ఇప్పటికే టెట్‌లో మంచి స్కోర్ సాధించిన అభ్యర్థులు సమయం వృద్ధా చేసుకోకుండా డీఎస్సీ ప్రిపరేషన్ ప్రారంభించారు. అధికమంది డీఎస్సీ కోచింగ్ తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక వేలకు వేలు చెల్లించి కోచింగ్ తీసుకోలేని వారు ఇంటి వద్దనే సొంత ప్రిపరేషన్ ప్రారంభించారు.డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత బోధన, ఉచిత భోజనం, వసతి సౌకర్యాలతోపాటు స్టడీ మెటీరియల్ కూడా ప్రభుత్వం కల్పించనుంది. అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందితో ఆయా జిల్లాల్లో మూడు నెలల పాటు ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ కింది లింక్‌పై క్లిక్ చేసి, దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులకు అక్టోబర్ 21 చివరి తేదీగా నిర్ణయించారు.అక్టోబర్ 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన ఏపీ టెట్ జులై 2024 పరీక్షల ప్రశ్నపత్రాలు, ప్రిలిమినరీ 'కీ'లతోపాటు రెస్పాన్స్ షీట్లను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. పేపర్ 1ఎ, 1బి పరీక్ష ప్రిలిమినరీ 'కీ'లపై అభ్యంతరాలను అక్టోబర్ 21వ తేదీలోగా ఆన్‌లైన్‌లో తెలియజేయాలి. మిగిలిన పరీక్షలకు సంబంధించిన క్వశ్చన్ పేపర్లు, ఆన్సర్ 'కీ'లు పరీక్ష జరిగిన తర్వాతి రోజుల్లో విడుదల కానున్నాయి. ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో జరుగుతున్న ఈ పరీక్షలు 21వ తేదీతో ముగుస్తున్నాయి. అక్టోబర్ 27న తుది 'కీ' విడుదల చేసి, నవంబర్ 2న ఫలితాలు ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# 420లకు నా విజన్ అర్థంకాదు

-మొదటిపేజీ తరువాయి

ఉండేది. ఇప్పుడు థింగ్ గ్లోబల్...యాక్ట్ గ్లోబల్ గా ఉండాలి" అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అమరావతి రాజధాని నిర్మాణం 2.0 ప్రారంభమైంది. రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునః ప్రారంభానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. శనివారం రాయపూడిలో పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు సీఎం. 80 శాతం నిర్మాణం పూర్తి చేసుకున్న అమరావతి నిర్మాణ ఏజెన్సీ సీఆర్డీయే కార్యాలయ పనులను చంద్రబాబు మొదలుపెట్టారు. రూ.160 కోట్లతో 7 అంతస్తుల్లో 2018 లో కార్యాలయ పనులను సీఆర్డీఏ చేపట్టిన విషయం తెలిసిందే. ఇటీవల జరిగిన సీఆర్డీఎ అథారిటీ సమావేశంలో పనుల ప్రారంభంపై నిర్ణయం తీసుకున్న సర్కార్.. వెంటనే అమలు చేసింది.



ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... ఒక చరిత్ర తిరగ రాయడానికి ఇక్కడ సమావేశం అయినట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చేప్పుడు ఒక వినూత్నమైన ఆలోచనకు శ్రీకారం చుట్టామని.. హైదరాబాద్‌లో 8 వరసల రింగ్ రోడ్డు వేసి మెట్రోకు కనెక్ట్ చేశామన్నారు. 5 వేల ఎకరాలు హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు ఇస్తామంటే అందరూ విమర్శించారని.. కానీ ఇప్పుడు 5000 ఎకరాల లాండ్ కూడా అభివృద్ధి అయిపోయిందన్నారు. హైదరాబాద్ జీఎస్‌డీపీలో 15 – 16 శాతం ఎయిర్‌పోర్టు నుంచి వచ్చిందన్నారు.

### లక్ష కోట్టు ఖర్చు అంటూ తప్పుడు ప్రచారం

రాజధాని నిర్మాణానికి రూ.లక్ష కోట్లు అవుతాయని... తమ వద్ద డబ్బులేదని ఐదేళ్లపాటు కాలయాపన చేశారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ మోడల్ సిటీ అని గతంలోనే చెప్పా. హైదరాబాద్ లో కూడా డబ్బులు ఖర్చు పెట్టలేదు... భూమి ఇచ్చి నీళ్లు ఇచ్చాం. దీంతో అక్కడ సంపద సృష్టి జరిగింది. ప్రభుత్వ డబ్బు అవసరం లేకుండా అమరావతి అభివృద్ధి చేస్తాం. అమరావతిని పట్టుకుని శ్మశానం, ఎడారి, మునిగిపోయిందని మాట్లాడుతున్నారు. వర్షాలకు చెన్నై, హైదరాబాద్ లో నీళ్లొచ్చాయి. బెంగళూరులో జగన్ కట్టుకున్న యలహంక ప్యాలెస్ లోకి నీళ్లు వచ్చాయి. ఒకరు చెడిపోవాలని కోరుకుంటే భగవంతుడు కూడా క్షమించడు.

### పనులు జెట్ స్పీడ్ తో జరుగుతున్నాయి

అమరావతిలో నిర్మాణ పనులు జెడ్ స్పీడ్ గా జరుగుతున్నాయి. అమరావతిలో గ్రీన్ ఎనర్జీ మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకుంటాం. ఈవీ స్టేషన్లు ఏర్పాటు చేస్తాం. వాకింగ్ ట్రాక్, సైకిలింగ్ ట్రాక్ లు ఏర్పాటు చేస్తాం. రాజధానిలో తలపెట్టిన పనులన్నీ మూడేళ్లలో పూర్తి కావాలి. ప్రజలు గెలవాలి...రాష్ట్రం అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చా.

### వీరోచితంగా మహిళల పోరాటం...

రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులను అభినందించిన సీఎం... భూసేకరణలో మంత్రి నారాయణ చాకచక్యంగా వ్యవహరించారని కొనియాడారు. రాష్ట్ర భవిష్యత్తు బావుంటుందని రైతులు ఇంత పెద్ద ఎత్తున భూమి ఇచ్చారని తెలిపారు. దాదాపు 4300 ఎకరాలు భూ సేకరణ చేశామని... మీరు సమాజహితం కోసం భూమి ఇస్తే గత ప్రభుత్వం అమరావతి రైతాంగాన్ని చాలా బాధపెట్టిందని మండిపడ్డారు. మహిళా రైతులు వీరోచితంగా పోరాడారని.. రాణి రుద్రమ కన్నా వీరోచితంగా పోరాడారని కొనియాడారు. " మీరు పడిన ఇబ్బందులు నేను చూశాను.. మీ ఉద్యమం కోసం జోలెపట్టి ఆర్థిక సాయం చేశాం. న్యాయస్థానం నుంచి దేవస్థానంకు వెళితే అడ్డుకున్నారు. మీరు రోడ్డుపై భోజనం చేశారు. దైవ నిర్ణయం... ఈ భూమి పవిత్రమైనది. ప్రపంచంలోని అన్ని క్షేత్రాల్లో పవిత్ర మట్టి, నీరు తెచ్చాం. ఈ బిల్డింగ్‌ను వెంటనే కాస్త మార్పులు చేర్పులతో 160 కోట్లతో ప్రారంభించాం. నాలుగు నెలల్లో పనులు ప్రారంభిస్తాం అన్నారు. 121 రోజున మరల వచ్చి ఈ భవనాన్ని ప్రారంభిస్తాం. రాష్ట్రానికి నడిబొడ్డున అమరావతి.. ఎటు చూసినా 12 పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. విశాఖపట్నం, కర్నూలు వెళ్లి అమరావతి ఏకైక రాజధాని అని చెపుతున్న. విశాఖ ఆర్థిక రాజధానిగా, కర్నూలులో హైకోర్టు బెంచ్, పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే లీజ్ పీరియడ్ అయిపోయింది.. అందుకు కొంత సమయం తీసుకున్నాం. రెండో ఇన్‌స్టాల్‌మెంట్ కోసం రైతులకు కౌలుగా రూ. 222 కోట్లు త్వరలో ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యవసాయ కూలీలకు రూ.5000 చొప్పున కూలీ ఇస్తున్నాం"అని వెల్లడించారు.

### ఇది దేవతల రాజధాని

"మన సంకల్పం చాలా గొప్పది... హైదరాబాద్ కోసం ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు . అక్కడ సంపద సృష్టించాను. ఔటర్ రింగ్ రోడ్డు ఆధారంగా అక్కడి ప్రభుత్వం వేల కోట్లు సాధిస్తోంది. లక్ష కోట్లు అవుతుందని మాట్లాడారు. అమరావతికి డబ్బులు పెట్టక్కర్లేదు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్సింగ్ మోడల్ ఉండే క్యాపిటల్. రాజధాని ప్రారంభించాం మరలా రాష్ట్రమంతా, అమరావతిలోనూ రేట్లు పెరిగాయి. ప్రభుత్వ డబ్బులు ఒక్క రూపాయి అవసరం లేదు. నిన్న బెంగళూర్‌లో ఆయన ఇల్లు మునిగింది.... అమరావతి కాదు. వేరే వాడు చెడిపోవాలి అనుకుంటే మనమే చెడిపోతాం. అమరావతి అనే పేరు సబబు అని రామోజీ రావు సూచించారు. నూటికి నూరు శాతం అమరావతిని ప్రజలు ఆమోదించారు. ఇది దేవతల రాజధాని. ఈ ప్రాంతంలో ఒక్క ఎండ తప్ప అన్ని అనుకూలతలే. బ్లూ, గ్రీన్ కాన్సెప్ట్‌తో నగర నిర్మాణం చేయాలనుకున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

### మూడేళ్లలో పనులు పూర్తి కావాల్సిందే...

"రోడ్లు, ఫ్లాట్‌లు ఇక్కడ తవ్వేశారు, అమ్మేసుకున్నారు. కేంద్రం సెంట్రల్ విష్ట తరహాలో అమరావతి నగరం ఉంటుంది. చరిత్రలో 1631 రోజులు ఉద్యమం చేసింది అమరావతి పరిరక్షణ సమితి. విట్, ఎస్ ఆర్‌ఎం పనిచేస్తుంది, అమృతి పనిచేస్తుంది. బిట్స్ పిలాని కూడా ఇక్కడకు వస్తుంది. టాప్ ఇన్‌స్టిట్యూషన్ ఇక్కడకు రావాలి. భారతదేశం రాబోయే రోజుల్లో నిర్మించే నగరం అమరావతి మాత్రమే. భవిష్యత్తులో ఈ నగరంలో ఒక కోటి జనాభా ఉంటుంది. అశ్విని వైష్ణవను కలిసి బులెట్ ట్రెయిన్‌పై మాట్లాడాను. చెన్నై , బెంగళూర్, హైదారాబాద్, అమరావతిలు కలుపుతూ ఈ ట్రెయిన్ రావాలని కోరాను. పెండింగ్ పనులు అన్నీ పూర్తి చేస్తాం. అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు అనుకున్న సమయానికి పూర్తి చేస్తాను. అన్ని పనులు ట్రాన్సురెంట్‌గా చేయండి. నగరంలో ఎలక్ట్రికల్ వెహికల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. రాబోయే రోజుల్లో గ్రీన్ ఎనర్జీ కరెంట్ వస్తుంది. మీకు మాక్సిమం 3 సంవత్సరాలలో పనులు పూర్తి చేయాలని చెపుతున్న. 8603 కేఎంతో రాజధాని ప్రాంతం 217 కిలోమీటర్ల సీఆర్‌డీఏ పరిధిలో అన్నాము. రైతులు, ప్రభుత్వం అమరావతి విషయంలో లాభపడ్డారు. అమరావతి పనులు పట్టాలు ఎక్కి స్పీడ్ అవుతాయి. పోలవరం 72 శాతం పనులు చేస్తే దాన్ని అడ్డుకున్నారు. ఈ ఏడాది వరుణ దేవుడు కరుణించాడు. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 పేరుతో ఇంకో విషన్ కూడా పెట్టుకున్న. నేను చెప్పేది 420లకు అర్థం కాదు. ప్రధాని నరేంద్ర మోడీ వికసిత భారత్ 2047 టేకప్ చేశారు" అని సీఎం వెల్లడించారు.

### ఒక్కసారే చెబుతా.. వినకపోతే

"ఆడబిడ్డల 2.1 బిడ్డలకు జన్మనివ్వడం అవసరం. ఇప్పుడు మనం 1.6 లో ఉన్నాం. కాబట్టి రాష్ట్రంలో జనం పెరగాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు జనాభా నియంత్రణ చెప్పాను ఇప్పుడు నేనే వద్దంటున్న . ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలు ఉన్నవారికి ప్రభుత్వ సాయం ఎక్కువ దక్కుతుంది. రాష్ట్రంలో స్వేచ్ఛగా అందరూ ఇప్పుడు నిద్రపోగలుగుతున్నారు. ఇప్పుడు కేంద్రం వద్ద మన పరపతి పెరిగింది డబ్బులు కూడా ఇస్తున్నారు. 93 శాతం గెలుపు ఈసారి సాధించాను. భూతం పోయింది ఫ్రీ గా ఉంటాము అనకూడదు. రాష్ట్రాన్ని నిర్మించాలి.. భూతాన్ని భూస్థాపితం చేయాలి. ఎమ్మెల్యేలకు చెప్పాను తప్పు చేస్తే ఒక సారి చెపుతా వినకపోతే మిమ్మల్ని వదులుకుంటా అని చెప్పాను" అంటూ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# మద్యం, ఇసుక దోపిడీపై జగన్ మాటలు హాస్యాస్పదం

-మొదటిపేజీ తరువాయి

దెబ్బతీసి ఇప్పుడు మద్యం టెండర్లు, ఇసుక రవాణాలో అక్రమాలు జరుగుతున్నాయని నీతులు చెబుతున్నారు... సిగ్గుండాలి అంటూ కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఐదేళ్ల పాలనపై జగన్ చర్చకు రాగలరా? అని సవాల్ విసిరారు. ఆదాయం పోయిందన్న అక్కసుతో జగన్ దిక్కుమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ఇసుక విషయంలోనూ జగన్ దోపిడీకి పాల్పడ్డారని, రూ.1000 కోట్ల మేర ప్రజధనాన్ని జగన్ లూటీ చేశారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలు సహించరన్న విషయాన్ని గమనించాలని హితవు పలికారు మద్యం టెండర్లు, ఇసుక రవాణాలో దోపిడీ జరుగుతోందంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. అమరావతిలో శనివారం ఆయన మాట్లాడుతూ.. జగన్ ధన దాహంతో రాష్ట్రాన్ని పీల్చి పిప్పి చేశారని అన్నారు. కూటమి సర్కార్‌లో పారదర్శకంగా జరిగిన మద్యం విధానంపై విమర్శలు చేయడం సిగ్గు చేటని మండిపడ్డారు. "ఎక్సైజ్ విభాగాన్ని నిర్వీర్యం చేసి వైసీపీ మద్యం పేరుతో దోచుకుంది నిజం కాదా? %వాజుదీ% పేరుతో అక్రమ మద్యం వ్యాపారానికి అడ్డులేకుండా చేసుకోవడం నిజం కాదా. తయారీ నుండి రిటైల్ అమ్మకాల వరకు అన్ని వ్యవస్థల్ని గుప్పిట్లో పెట్టుకొని ప్రభుత్వ షాపుల పేరుతో దోచుకున్నది నిజం కాదా? జగన్ కల్తీ మద్యం కారణంగా 50 లక్షల మంది కిడ్నీ, లివర్ సమస్యలతో సతమతమయ్యారు.




ప్రభుత్వ షాపుల్లోనే వేలాది ఉల్లంఘనలు జరగడంపై ఏం సమాధానం చెబుతావు? ఎన్నడూ లేని విధంగా 2019–24 మధ్య అక్రమ మద్యం రవాణా కేసులు ఎందుకు ఎక్కువగా నమోదయ్యాయి? వ్యవస్థల్ని నిర్వీర్యం చేసి ఇప్పుడు నీతులు చెప్పడానికి సిగ్గు పడాలి. రాష్ట్ర ఖజానాకు ఆదాయం తగ్గించి.. మీ ఆదాయం పెంచుకోవడం నిజం కాదా? కూటమి అధికారంలోకి వచ్చాక దేశ వ్యాప్తంగా ఉన్న మద్యాన్ని ఏపీలో అందుబాటులో ఉంచేలా పాలసీ తీసుకొచ్చాం. రూ.99 కే క్వార్టర్ అందించే ప్రయత్నం చేస్తున్నాం. రిటైర్డ్ జడ్జితో టెండర్ కమిటీ వేసి ధరల్ని నిర్ణయించబోతున్నాం. నీతులు చెప్తున్న జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో జరిగిన మద్యం అక్రమాలపై చర్చకు సిద్ధమా? కల్లు గీత కార్మికులకు కేటాయించిన షాపులకు త్వరలోనే దరఖాస్తులు స్వీకరిస్తాం. అత్యంత పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు జరిగింది. ప్రభుత్వంపై నమ్మకంతో 89,882మంది దరఖాస్తు చేసుకుని, దుకాణాలు ఏర్పాటు చేశారు. పునరావాసం కోసం అదనంగా 2 శాతం సెస్ అమలు చేస్తున్నాం. ఆదాయం పోయిందనే బాధతో జగన్ రెడ్డి దిక్కుమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలు ఊరుకోరు అని గుర్తుంచుకోండి. ఇసుక మొత్తాన్ని గుప్పిట్లో పెట్టుకొని దోచుకున్న ఘనత జగన్ రెడ్డికే చెందుతుంది. జగన్ రెడ్డి ఇసుక మాఫీయా కారణంగా 70 మంది భవన నిర్మాణ కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. రూ.వెయ్యి కోట్లకు పైగా ప్రజా ధనాన్ని జగన్ బినామీ కంపెనీలతో కలిసి దిగమింగారు. మీ అక్రమాల కారణంగానే ఎన్జీటీ రూ.100 కోట్ల జరిమానా విధించింది. ఉన్నతాధికారులకు చీవాట్లు పెట్టింది. రాష్ట్రంలో 130 ఇసుక రీచులు ఎందుకు మూతబడ్డాయో సమాధానం చెప్పాలి. అధికారంలోకి రాగానే జులై 8 న ఉచిత ఇసుక పాలసీని ప్రకటించాం. అక్టోబర్ 15 వరకు ఇసుక తవ్వకాలకు ఎన్జీటీ అడ్డుకోవడం వాస్తవం కదా? ఐదేళ్ల పాలనా కాలంలో ఏ రోజైనా అందుబాటులో ఉన్న ఇసుక వివరాలు బయట పెట్టారా? విలువలు వదిలేసి రాజకీయం చేయడం జగన్ రెడ్డికి అలవాటుగా మారిపోయింది. ఆన్లైన్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చి ఎవరైనా ఇసుక బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించాం. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో ఉచితంగా ఇసుక తీసుకెళ్లొచ్చని నిర్ణయించాం. 8 జిల్లాల్లో డీసిల్టేషన్ కోసం అనుమతులు ఇచ్చి ఇసుక అందుబాటులో ఉంచాం. ఓపెన్ టెండర్లపై కూడా జగన్ రెడ్డి విమర్శలు చేయడం సిగ్గు చేటు. ఐదేళ్లు వ్యవస్థల్ని నిర్వీర్యం చేసిన జగన్ రెడ్డి ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదం. సీనరేజి వసూళ్లను కూడా ఉపసంహరించుకున్నాం. కనీసం పారదర్శకత అంటే ఏంటో జగన్ రెడ్డికి తెలుసా? వ్యవస్థల్ని చెప్పు చేతుల్లో పెట్టుకుని రాష్ట్రాన్ని రావణకాష్టం చేసిన ఆయనకు ప్రజలు బుద్ధి చెప్పారు. పొరుగు రాష్ట్రాలకు తరలించినా, బ్లాక్ మార్కెట్ సృష్టించినా తీవ్ర చర్యలు ఉంటాయని వైసీపీ, జగన్ గుర్తుంచుకోవాలి" అని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు.

## ముడా స్కామ్‌లో కొనసాగుతున్న ఈడీ సోదాలు..

### ఏపీ వైఎస్సారీపీ నేతకు షాక్ ఇచ్చిన దర్యాప్తు సంస్థ!




మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ స్కామ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు శనివారం సైతం కొనసాగాయి. ఈ కేసులో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో పాటు ఆయన కుటుంబ సభ్యులతో పాటు పలువురిపై కేసు నమోదైంది. సాక్షాత్తూ సీఎం సిద్ధరామయ్య సతీమణి పార్వతికి ముడా ద్వారా 14 ప్లాట్లు కేటాయించారని.. ఈ కేటాయింపుల్లో అక్రమాలు జరిగినట్లుగా ఆరోపణలున్నాయి. ఈ కేసులో ఈడీ శుక్రవారం ముడా కార్యాలయంపై దాడులు చేసింది. ఈ సందర్భంగా ఇతర వ్యక్తులను కార్యాలయ ఆవరణలోకి రాకుండా అధికారులు అడ్డుకున్నారు. మైసూర్‌లోని ముడా కార్యాలయం, తహసీల్ కార్యాలయం, నిందితుల స్థలాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ, సీఆర్‌పీఎఫ్ భద్రతా బృందం సోదాలు చేస్తోంది. భూసేకరణ, కేటాయింపు విధానాలపై ఆరా తీయాలని ఈడీ ముడాకు పలు లేఖలు పంపినప్పటికీ సంతృప్తికరమైన సమాధానం రాలేదని, ఆ తర్వాత దాడులు నిర్వహించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. లోకాయుక్త ఇటీవల దాఖలు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను పరిగణనలోకి తీసుకుని, సీఎం, ఇతరులపై కేసు నమోదు చేయడానికి ఈడీ సెప్టెంబర్ 30 న ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు సమాచార నివేదిక దాఖలు చేసింది. ఇదిలా ఉండగా.. ఏపీకి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీ, తెలుగు సినీ నిర్మాత ఎంవీవీ సత్యనారాయణ తదితరుల ఇళ్లపై ఈడీ శనివారం దాడులు చేసింది. విశాఖపట్నం సహా ఐదు చోట్ల సోదాలు జరిగాయి. ప్రభుత్వ భూమిని ఆక్రమించారనే ఆరోపణలతో సత్యనారాయణ తదితరులపై పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లో మనీలాండరింగ్ కేసు వెలుగులోకి వచ్చింది. సత్యనారాయణ 2024 లోక్‌సభ ఎన్నికల్లో విశాఖపట్నం నుంచి వైఎస్సార్‌సీపీ టికెట్‌పై పోటీ చేసి ఓడిపోయారు. ఇటీవల నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ, క్రిమినల్ బెదిరింపు ఆరోపణల నేపథ్యంలో స్థానిక పోలీసు కేసులో సత్యనారాయణ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుంచి ఆయన ముందస్తు బెయిల్ పొందిన విషయం విధితమే.

## లంచం అనే పదం వినిపించొద్దు...

-మొదటిపేజీ తరువాయి

డిప్యూటీ సీఎం పేషీలో ఉన్న అధికారులు అంతా పూర్తి పారదర్శకంగా పని చేస్తున్నారని తెలిపారు. కాగా.. ఈరోజు పలువురు పవన్ కళ్యాణ్ సమక్ష్యంలో జనసేన పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీమంత్రి, ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి భారతి కూడా ఉన్నారు. దీంతో ముద్రగడకు బిగ్ షాక్ తగిలింది. పార్టీలో చేరిన వారికి పవన్ కళ్యాణ్ జనసేన కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... రాష్ట్రం బాగుండాలని , ఒక ఆశయాన్ని నమ్ముకుని ముందుకు సాగుతున్నామని ఉద్ఘాటించారు. తమ మీద నమ్మకంతో ఈరోజు పార్టీలో చేరిన వారందరికీ పవన్ కళ్యాణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలోనే ముద్రగడ కుమార్తె క్రాంతి భారతి జనసేనలో చేరుతానని వచ్చారని అన్నారు. ఆ కుటుంబాన్ని విడదీయటం ఇష్టం లేదని ఆనాడే చెప్పానని అన్నారు. ముద్రగడ కుమార్తె 100 రోజుల తర్వాత ఇప్పుడు వచ్చి తన భర్తతో కలిసి జనసేనలో చేరారని చెప్పారు. సీనియర్ నేత చందూ సాంబశివరావుతో పాటు, గుంటూరు, జగ్గయ్యపేట, పెడన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఈరోజు జనసేనలో చేరారని అన్నారు. సామినేని ఉదయభాను ఎంతో కాలం నుంచీ తనకు తెలుసునని చెప్పారు. రాజకీయాలను క్రమశిక్షణతో చేసే వ్యక్తి.. మాట తూలని వ్యక్తి అని పవన్ కళ్యాణ్ తెలిపారు. "నాతో కలిసి పని చేయడానికి ముందుకు వచ్చిన సామినేని ఉదయభానుక ప్రత్యేక కృతజ్ఞతలు. ఎన్టీఆర్ జిల్లా బాధ్యతలు కూడా ఆయనమీద నమ్మకంతో అప్పగించాను. గ్రామసభ వారోత్సవాల ద్వారా పల్లెల్లో అభివృద్ధి చేస్తున్నాం. ప్రజలకు ఎటువంటి సేవ చేయాలన్నా కూడా తప్పకుండా పార్టీ పరంగా ప్రోత్సహిస్తాం. గుడివాడలో మంచినీటి ఇబ్బంది ఉన్నా గత పాలకులు పట్టించుకోలేదు. ఆయాగ్రామాల్లో మంచినీరు అందించే విధంగా వెంటనే యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాం. ఇది మన ప్రభుత్వం.. ప్రజలకు కావాల్సిన కనీస అవసరాలను హక్కుగా చేయించుకోండి" అని పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు



-మొదటిపేజీ తరువాయి

గత ప్రభుత్వంలో చట్టాలు ఉల్లంఘించిన వారందరిపై చర్యలు ఉంటాయన్నారు లోకేష్. రెడ్‌బుక్ చూస్తే జగన్ ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని లోకేష్ స్పష్టం చేశారు. ఉచిత ఇసుక విధానంలో లోపాలను సరిచేస్తామని.. 2019లో ఏధరకు ఇసుక లభించిందో అదే ధరకు ఇసుక లభ్యమయ్యేలా చూస్తామన్నారు. యూనివర్సిటీల్లో కొత్త వీసీల నియామకానికి సెర్చ్ కమిటీ ఏర్పాటు కావాల్సి ఉందని వెల్లడించారు. త్వరలో ఏజన్సీలోని పాఠశాలలను కూడా సందర్శిస్తానని మంత్రి లోకేష్ చెప్పారు.గత ఐదు సంవత్సరాలుగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం మీద ఎన్నో ఉద్యమాలు కొనసాగుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఉద్యమానికి సంబంధించి.. ఒక క్లారిటీ ఇవ్వడం కోసం ఈ మధ్య కాలంలో స్వయాన ఆ కేంద్ర ఉక్కు శాఖామంత్రి కుమారు స్వామి అక్కడికి వెళ్లి కార్మికులతోను, సీఎండీ తోను మాట్లాడిన సంగతి తెలిసిందే. విశాఖ స్టీల్ ప్లాంట్ దేశానికి అవసరమైన ప్రాజెక్ట్.. ఎట్టి పరిస్థితుల్లోను ప్రైవేటీకరణ కాదని చెప్పారు. అయినా కూడా ప్రైవేటీ కరణ లేదని ప్రకటిస్తూనే ఉద్యోగులపై వేటు వేసింది. తర్వాత వాళ్ల పాస్‌లు రెన్యువల్ చేయడం, కొన్ని యూనిట్లు ఆగిపోతున్న సమయంలో మళ్లీ వాటిని తిరిగి ప్రారంభించే దిశగా కొంతవరకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఖర్చులు, జమాలు మొత్తం ఎస్‌బీఐ చూసుకునేలా ఇటీవల రూ.500 కోట్లు రిలీజ్ చేశారు. ఇప్పటికే స్టీల్ ప్లాంట్‌కు సంబంధించి సెయిల్‌లో మెర్జ్ చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.సూత్ర ప్రాయంగా కేంద్ర ప్రభుత్వం, ఉక్కు శాఖ కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం. మరొక రూ.200 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయినా కూడా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం ఇంకా రగులుతూనే ఉంది. ఇది ఎప్పుడు ఏ విధంగా ప్రైవేటీకరణ చేస్తారని ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. లోపల ఉన్నటువంటి దాదాపుగా 8 యూనిట్లకు సంబంధించి ఇప్పటికే నాలుగు యూనిట్లు ఆగిపోయాయి. కాబట్టి గ్యాడ్యూవల్ గా యూనిట్స్ అన్నింటిని కూడా నిలుపులదల చేసి.. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం పన్నాగం పన్నుతుందని స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, అభిప్రాయ పడుతున్నారు. అయితే వీరి భయాందోళనను మొత్తం పటాపంచల్ చేస్తూ.. మంత్రి నారా లోకేష్ ఓ ప్రకటన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ లేదని తేల్చి చెప్పారు.అయితే ఈ ప్రకటన వెనుక ఖచ్చితంగా లోకేష్ సొంత మాటల్లా కనిపించడం లేదు. ఎందుకంటే వారం రోజుల క్రితమే ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లడం.. అక్కడ ప్రధానితో, కీలకమైన శాఖా మంత్రులతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలోనే ఒక స్పష్టమైన హామీ వచ్చి ఉంటాదని.. ఆ హామీ రావడం వల్లే నారా లోకేష్ ప్రకటన చేశారనేది ప్రస్తుతం విశాఖలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# పంట నష్టపోయిన రైతులను అన్నివిధాల ఆదుకుంటాం

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 19)

ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులను అన్నివిధాల ఆదుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ, సచివాలయాలు, వాలంటీర్ల శాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చెప్పారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. శనివారం పొదిలి మండలం కొండాయపాలెం, తాళ్లూరు మండలం రామభద్రాపురం, మాధవవరం గ్రామాలలో జిల్లా కలెక్టరు ఏ తమీమ్ అన్సారియాతో కలిసి ఆయన పర్యటించారు. పొదిలిలో స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, తాళ్లూరులో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మితో కలిసి వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అకాల వర్షాలకు 17 మండలాలు ప్రభావితమయ్యాయన్నారు. ముఖ్యంగా పశ్చిమ ప్రాంత రైతులు బాగా నష్టపోయారన్నారు. జొన్న, సజ్జ, అలసందలు, పత్తి, వరి, మినుము పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. అదే విధంగా ఉద్యాన పంటలైన బొప్పాయి, కొంత మేర పొగాకుకు కూడా నష్టం జరిగిందన్నారు. ఈ అకాల వర్షాల వలన జిల్లాలో సుమారు 300 నుండి 400 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని మంత్రి చెప్పారు. రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ఇప్పించడంతోపాటు బ్యాంకులు ఇచ్చిన రుణాలను తిరిగి చెల్లించే విషయంలో రీషెడ్యూల్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కౌలు రైతులను కూడా ఆదుకునేందుకు చట్టం తీసుకువస్తామన్నారు. రైతులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి రైతులకు పంటల ఇన్సూరెన్స్, నష్టపరిహారం సత్వరమే అందేలా చూస్తామన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3749 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, 3231 మంది రైతులు నష్టపోయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు వేశారన్నారు. వాటితోపాటు 560 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినట్లు ఆమె చెప్పారు. ఈ మేరకు పంట నష్టం ప్రాథమిక అంచనాలను ప్రభుత్వానికి పంపించామన్నారు. పంటలు చాలామేరకు దెబ్బతిన్నాయని, రైతులకు ప్రభుత్వపరంగా అందవలసిన సహాయాన్ని త్వరగా అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మార్కాపురం నియోజకవర్గంలో పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు, మార్కాపురం మండలాలలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులు భారీగా నష్టపోయి అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని మంత్రి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. తక్షణమే వారు స్పందించి స్వయంగా దెబ్బతిన్న పంటల పరిశీ లనకు వచ్చారన్నారు. ముఖ్యంగా సజ్జ, పొగాకు పంట రైతులు తీవ్రంగా నష్టపోయారని, సదరు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఇన్సూరెన్స్ ,నష్టపరిహారం అందేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా వారి వెంట కనిగిరి, ఒంగోలు ఆర్.డి.ఓ.లు. కేశవర్ధన్ రెడ్డి, లక్ష్మీ ప్రసన్న, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఉద్యానశాఖ అధికారి గోపీచంద్, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, పొదిలి మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్‌భాష, మండల తెలుగుయువత అధ్యక్షులు పోపూరి నరేష్, కొండాయపాలెం నాయకుడు సుబ్బారావు, స్థానిక అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

# నిమ్జ్ ప్రాంతంలో డిఫెన్స్ కారిడార్‌ను పరిశీలించిన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

(షణ్ముఖ వెలుగు, పామూరు, అక్టోబర్ 19)

మండలంలోని మాలకొండపురం గ్రామంలో నిమ్స్ ప్రాంతంలో డిఫెన్స్ కార్డల్ ఏర్పాటుకు జయరావుతో కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ అత్యధికంగా వలసలు వెళ్తున్న కనిగిరి ప్రాంతంలో నిమ్జ్ ఏర్పాటుకు కేంద్రం 2012లోనే పచ్చ జెండా ఊపిందన్నారు. నిమ్జ్ పూర్తి అయితే మూడు లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జనసేన నాయకులు పాల్గొన్నారు.



# పాఠశాల స్థలాన్ని మింగేసారు

## మనం ఎవడ్రా ఆపేది అన్న రీతిలో అక్రమార్కులు

(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, అక్టోబర్ 19)

మండలంలోని చాపలమడుగు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని అక్రమార్కులు దర్జాగా ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విస్మయానికి గురిచేస్తోంది. ఏకంగా పాఠశాల ప్రాంగణం ఆక్రమణకు గురై నిర్మాణాలు వెలుస్తున్నా తాత్కాలిక అడ్డగింపులు తప్ప శాశ్వత పరిష్కారానికి చొరవ కనిపించడం లేదు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల భూములు ఆక్రమణకు గురైపోతున్నా ఇటు విద్యాశాఖ అధికారులు గాని అటు రెవెన్యూశాఖ అధికారులు గాని తమకేమీ పట్టిపట్టనట్లు ఉంటున్నారు. గత ప్రభుత్వంలో కూడా కొంత మంది అక్రమార్కులు పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకోవడంతో అప్పటి అధికారులు పాఠశాల నాడు నేడు క్రింద రావడంతో అక్రమాలను తొలగించారు. ఇప్పుడు మరల అదే తంతు మొదలైంది అని స్థానికులు చెబుతున్నారు. స్థానికులు అడ్డుకుంటే గొడవకు రావడం వంటి ఘటనలు సర్వసాధారణంగా మారాయి. స్థానికులు ఎన్నో సార్లు పాఠశాల ప్రాంగణం ఆక్రమణ వ్యవహారంపై సంబంధిత అధికారులకు తెలియజేసినా క్షేత్ర స్థాయి సందర్శనకే పరిమితమౌతుంది తప్ప శాశ్వత పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు జరగడం లేదు. మండల రెవెన్యూ అధికారులు, ఇతర అధికారులు పాఠశాలను సందర్శించడం, ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించడం తిరిగి వెళ్లిపోవడం సర్వసాధారణంగా మారింది. తాజాగా కొందరు అక్రమార్కులు ఆక్రమణ స్థలంలో రేకులు షెడ్లు నిర్మాణాలు నిర్మించారు. ఇలా ఎందుకు ఆక్రమించారు అని స్థానికులు అడిగితే గొడవలు పెట్టుకొని మీ దిక్కున్న చోట చెప్పుకోండి (తరువాయి 4లో...)



# వరదబాధితులకు రూ.4 లక్షల నగదు సిఎం చంద్రబాబుకు అందజేత

## – అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం – రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బోనుదుర్గ వెల్లడి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 19)

అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం కళాప్రదర్శనలు, రోడ్ షో లో వచ్చిన రెండు లక్షల రూపాయలు, పద్మశ్రీ ఎడ్ల గోపాలరావు రెండు లక్షల రూపాయలు మొత్తం కలిసి నాలుగు లక్షల రూపాయలు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ద్వారా మంగళగిరిలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అందజేసినట్లు అఖిల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బోను దుర్గ తెలిపారు. తదుపరి శనివారం ఒంగోలు రంగభూమి కళాకారుల సంఘం కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఉన్నటువంటి కళాకారులు పడుతున్న కష్టాల గురించి అదేవిధంగా కళాకారులకు అందవలసిన బెనిఫిట్స్ గురించి వివరించి ఏదైతే గత ప్రభుత్వంలో చింతమణి నాటకాన్ని ఒంటెద్దు పోకడతో నిషేధించారో యధావిధిగా దాన్ని ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి విన్నవించినట్లు తెలిపారు. విజయవాడ వరద బాధితులకు సహాయార్థం జరిగిన రోడ్ షోలో పాల్గొన్న ప్రముఖ కళాకారుడు అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షురాలు గంట మంగాదేవి, అధ్యక్షులు ద్వారపురెడ్డి ధనుంజయరావు, కార్యదర్శి, రౌతు వాసుదేవ్, మువ్వల వెంకటరమణ, బొంగు భాస్కర్, మిమిక్రీ శివ, గంటా సూర్యనారాయణ, ఎడ్ల గోపాలరావు, లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ప్రకాశం జిల్లా కళాకారులు రంగ భూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, ఏల్చూరి అనంతలక్ష్మి, తాళ్లూరు శ్రీదేవి, దేనువుకొండ సుబ్బయ్య, చల్లా నాగేశ్వరమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించి, సహాయాన్ని అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా బోను దుర్గా ధన్యవాదాలు తెలిపారు.




# చస్తేనే స్పందిస్తారా.....!

## నిర్లక్ష్యం వీడని విద్యుత్ శాఖ ప్రమాదం అంచున 11కేవీ విద్యుత్ స్తంభాలు

(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 19)

కంభం పట్టణంలోని కందులాపురం సినిమా హాలు సెంటర్ వెనుక రెండు స్తంభాలు, అర్బన్ కాలనిలో మరో విద్యుత్ స్తంభం నేలకొరగటానికి సిద్ధంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎన్నో సార్లు స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా అదిగోఇదిగో అంటూ నెలలు గడుస్తున్నా పట్టించుకోని పరిస్థితి. విలేకరులు స్పందించి పత్రికలో కథనం రాస్తే హుటాహుటిన వచ్చి సమస్యను పరిష్కరిస్తామని చెప్పి వెళ్ళిపోతున్నారని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. తరువాత ఇటు వైపు తొంగిచూడరన్నారు. ఎవరైనా చస్తే గాని వీళ్ళు స్పందించరా అంటూ స్థానిక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ బిల్లులు కట్టకుంటే వెంటనే వచ్చి కరెంట్ తీసివేస్తారు కాని మా గోడు మాత్రం ఆలకించరు అని అన్నారు. ఈ స్తంభాలు మా ఇళ్ల పై పడి ప్రాణ, ఆస్తి నష్టం జరగకముందే వీటిని సరిచేయాలని, లేకుంటే జరగబోయే ప్రమాదానికి పూర్తి భాద్యత విద్యుత్ అధికారులదే అని వారంటున్నారు. ఈ మధ్య కురిసిన వర్షాలకు స్తంబాలు (తరువాయి 4లో...)





# పంట నష్టపోయిన రైతులను అన్నివిధాల ఆదుకుంటాం
















## పాఠశాల స్థలాన్ని మింగేసారు

అని



స్థానికుల పై బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మరి తెలుగుదేశం ప్రభుత్వంలో ఇలాంటి ఆక్రమణలకు చోటు లేదని ఓ వైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నా స్థానికంగా మాత్రం ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వ యంత్రాంగం ఘోరంగా వైఫల్యం చెందుతుంది. మరి ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారో లేక మౌనంగా ఉంటారో కాలమే సమాధానం చెప్పాలి.

## చస్తేనే స్పందిస్తారా....!



పూర్తిగా తడిసిపోయి ఉన్నాయని, ఇవి ఐరన్ స్తంభాలు కావడంతో చిన్నపిల్లలు ఎక్కడ ముట్టుకుంటారో అని ప్రతి క్షణం భయపడుతున్నామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిద్రమత్తు వీడి తక్షణమే పరిష్కరించాలని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతూ అధికారులకు విన్నవించుకుంటున్నారు.

## వ్యాపార వర్గాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుంది

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి




**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 19)**

రాష్ట్రంలో వ్యాపార వర్గాలకు అన్ని రకాలుగా అండగా ఉండి వారి ఆర్థిక అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ దోహదపడుతుందని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మాచర్ల దుర్గి దాల్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారులకు అందించి మన్ననలు పొందాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిన్న మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. నూతన పారిశ్రామికవేత్తలకు రాష్ట్రంలో అనువైన వాతావరణం కల్పించడంతోపాటు వారికి ప్రభుత్వం నుండి రావలసిన అనుమతులను సత్వరమే అందించేందుకు వ్యవస్థను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం యూనియన్ సభ్యులు

## జిల్లాస్థాయి చెస్ పోటీలలో సత్తా చాటిన కిడ్స్ పాఠశాల విద్యార్థులు



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 19)**

మాచర్ల పట్టణంలోని స్థానిక కిడ్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనందుకు పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు. గుంటూరు డిస్టిక్ ఎస్ జి ఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చెస్ గేమ్ సెలక్షన్స్ అండర్ 17 గుంటూరు లోని చౌత్రా సెంటర్లో గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ లో నిర్వహించిన కాంపిటేషన్‌లో కిడ్స్ పాఠశాల విద్యార్థులు పాల్గొనడం జరిగినది. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థులు చంద్ర మహేష్, భార్గవ, శ్రీనివాస్ నాయక్ లు జిల్లాస్థాయిలో ఎంపికవడం జరిగింది. ఎంపికైన విద్యార్థులను కిడ్స్ పాఠశాల యాజమాన్యం ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కిడ్స్ పాఠశాల హెచ్ఎం జొన్నలగడ్డ రామకృష్ణ శాస్త్రి, ఏవో విజయ శేఖర్, పవన్, పిఈ టిలు ఆనంద్, రామారావు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 19)**

కీర్తిశేషులు స్వర్గీయ హాజీ ఏంఏ ఖయ్యూమ్ నాల్గో వర్ధంతి సందర్భంగా పొదిలిలోని శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో శనివారం లాల్ ఫాండేషన్ పొదిలి తరపున అల్ మోమిన్ బీఈడి కాలేజ్ వారు పొదిలి శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థినిలకు చెరొక పదివేల రూపాయలను ప్రోత్సాహక బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ మండల విద్యాశాఖధికారి కే యల్లమందారెడ్డి పాల్గొని ప్రసంగించారు. సభా కార్యక్రమం అనంతరం ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో టాపర్స్‌కి లాల్ ఫాండేషన్ ట్రస్ట్ తరపున అఖీబ్ అహమ్మద్ కుమారుడు అలీ హాజీర్ చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో లాల్ ఫాండేషన్ తరపున అలీ హాజీర్, కే యల్లమందారెడ్డి, శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల కరెస్పాండంట్ కేవి రమణారెడ్డి, డైరెక్టర్ వై వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎంకే కుమార్, ఏఓ అశోక్ బండి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## స్నేహా సూపర్ స్పెషాలిటీ హాస్పిటలను సందర్శించిన ఎంపీ మాగుంట





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 19)**

ఒంగోలులో నూతనంగా ప్రారంభించినస్నేహ సూపర్ స్పెషాలిటీ హాస్పిటలను పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో మంచి వైద్యాన్ని అందించాలని కోరారు. ఆయనతో పాటు డాక్టర్ శరత్, డాక్టర్ మల్లీపెద్ది, వి కృష్ణయ్య, డాక్టర్ సాయి స్నేహ, యడ్లపల్లి, తదితరులు పాల్గొన్నారు.

# బెదిరింపుల ఎమ్మెల్యేలు, మంత్రుల పై కేసులు నమోదు చేయాలి

## మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 19)

:ఇసుక, మద్యం విషయాల్లో జోక్యం చేసుకుంటే సహించను అని చంద్రబాబు తన సొంత పార్టీ నేతలకు జారీ చేస్తున్న హెచ్చరికల్లో నిజంగా చిత్తుశుద్ధి ఉంటే, ఇప్పటి వరకు వివిధ జిల్లాల్లో బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలు, బ్లాక్‌మెయిల్ చేసిన ఎమ్మెల్యేలు, మంత్రులపై ఎందుకు కేసులు నమోదు చేయలేదని నెల్లూరు జిల్లా వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ విషయంలో చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఇసుక, మద్యం వివాదాల్లో ఉన్న ఎంత మంది ఎమ్మెల్యేలు, మంత్రులపై కేసులు నమోదు చేశారు? ఎంత మందిపై చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు మాటలకు అర్థాలే వేరు అన్న కాకాణి.. తమ పార్టీ వారెవ్వరూ ఇసుక, మద్యం జోలికి పోవద్దని చంద్రబాబు చెప్పాడంటే.. ఇష్టారాజ్యంగా దోచుకోమని వారికి చెప్పినట్లే అని స్పష్టం చేశారు. కూటమి ఈ నాలుగు నెలల పాలనంతా యథేచ్ఛగా దోచుకో తినుకో పంచుకో (డీపీటీ) అని మాజీ మంత్రి ఆక్షేపించారు. ఇసుక, మద్యం పాలసీల్లో అంతా గోల్‌మాల్ అన్న ఆయన, ప్రభుత్వ మాటలకు, చేతులకు ఎక్కడా పొంతన లేదని, ఇసుక మొత్తం దోచుకున్నాక సీనరేజ్ రద్దు అని ప్రకటించారని దుయ్యబట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇసుక ధర వేలల్లో ఉండగా, సీనరేజ్ రద్దుతో కేవలం పదుల్లోనే ఊరట కలుగుతుందని తెలిపారు. ఇసుకలో రూ.800 కోట్ల ఆదాయానికి గండి కొట్టిన కూటమి నేతలు, ఎక్కడికక్కడ యథేచ్ఛగా దోపిడి చేశారని అన్నారు. నెల్లూరులోనూ కూటమి నేతల దందా కొనసాగుతోందన్న కాకాణి, స్థానిక సూరాయపాలెం ఇసుక రీచ్‌లో రూ.100 కోట్ల ఇసుక దోపిడీకి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్కెచ్ వేశారని ఆరోపించారు. జిల్లాలోని నాలుగు ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలకు టన్ను ఇసుకకు రూ.114.90 నిర్ణయిస్తే, రూ.36 కే చేస్తామని టెండర్లు వేయడం వెనుక రీచ్‌లను తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు చేసిన కుట్ర కాదా? అని నిలదీశారు. ఇసుక రీచ్‌లకు దాఖలైన టెండర్ల నుంచి లాటరీ ద్వారా కాంట్రాక్ట్ ఖరారు చేయాలన్న నిబంధనను మంత్రి నారాయణ ఒత్తిడి మేరకు కలెక్టర్ బేఖాతర్ చేస్తూ, ఎమ్మెల్యేల అనుచరులకు తిరిగి కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వీటన్నింటిపై ఈనెల 25న ధర్నా చేస్తామని కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రకటించారు.

# అంటూ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

## జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సురేష్ కుమార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 19)

ఈ నెల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖఅధికారి ఛాంబర్ నందు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో అక్టోబర్ 21, 22 తేదీలలో కేంద్ర ఆరోగ్య బృందం ప్రకాశం జిల్లాను సందర్శించు సందర్భంగా అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు సామజిక ఆరోగ్యకేంద్రాలు ఏరియా, జిల్లా ఆసుపత్రులలో అమలు అవుతున్న హెచ్.యమ్.ఐ.ఎస్, యాప్.యమ.ఐ.ఎస్, మాతృ,శిశు మరణాలు కుటుంబ సంక్షేమ కార్యక్రమములు , జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమం, అసంక్రమణ వ్యాధుల నివారణ కార్యక్రమం సంబంధించి అందిస్తున్న సేవలను , అన్ని రిపోర్ట్స్, రికార్డ్సులను పరిశీలించడం జరుగుతుంది అని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రా సిబ్బంది అందరిపై జాతీయ కార్యక్రముల రిపోర్ట్స్ రికార్డ్సులతో సిద్ధంగా ఉండవలసినదిగా ఆదేశించారు. అదేవిధముగా జిల్లాలో అధిక వర్షాలు కురుస్తూ ఉన్నందున నీటి కాలుష్యం వలన అధిక వర్షాలు సందర్భముగా అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రములలో ముందస్తుగా అంటూ వ్యాధులు ప్రబలకుండా తీసుకొనవలసిన ముందు జాగ్రత్తల గురించి జిల్లా లోని అందరు వైద్య అధికారులు, సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడం. జరిగింది. వైద్య అధికారులు,సిబ్బంది అందరు వారికీ నిర్దేశించిన గ్రామం, పట్టణములలోనే విధిగా నివాసము ఉండి ఏళ్ళవేళ్ళల ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని కోరారు.. అత్యవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు . అన్ని త్రాగు నీటి వనరులను క్లోరినేషన్ చేసి రికార్డ్ చేయాలని ఆదేశించారు. అత్యవసరమైన సమయములలో 108 అంబులెన్స్ కి ఫోన్ చేసి సత్వర అత్యవసరమైన చికిత్సనుఅందించాలని ఆదేశించారు. ఈ సమీక్షాసమావేశములో డాక్టర్ పద్మజ ఇమ్యూన్ జేషన్ అధికారిడాక్టర్ వాణిశ్రీ డి.పి.యమ.ఓ, డాక్టర్ భగీరథి యం.సి.డి. నొడలల్ అధికారి, డాక్టర్ శ్రవణ్ మలేరియాధికారి, ప్రసాద్ గణాంకాల అధికారి, సుగుణమ్మ డి.పి.హెచ్.యన్.ఓ, శ్రీనివాసులు మాస్ మీడియా అధికారి , సరోజినీ ఉప మాస్ మీడియా అధికారి , సుబ్బలక్ష్మి డి.పి.ఓ,పాల్గొన్నారు.

# గర్భిణులు, తల్లులు, పిల్లలకు మునగాకు పై అవగాహన కార్యక్రమం

## సెక్టార్ సూపర్‌వైజర్ కె అంజమ్మ



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 19)

మండల కేంద్రమైన ఉలవపాడు సెక్టార్ 4 అంగన్వాడి కేంద్రంలో శనివారం సెక్టార్ సూపర్వైజర్ కె అంజమ్మ ఆధ్వర్యంలో గర్భిణులకు, తల్లులకు పిల్లలకు మునగాకు పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలోసూపర్వైజర్ మాట్లాడుతూ మునగాకు తీసుకోవడం అనేది మన శరీర ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా చాలా మంచిది 100 గ్రాములు మునగాకులు 6750 మైక్రోగ్రాముల ఫీచర్ కొరిటిన్ ఉంటుంది. ఇది శరీరంలోకి వెళ్లి విటమిన్ ఏ గా తయారవుతుంది. అందుకే కంటి చూపులు మెరుగుపరచడానికి మునగాకు చాలా మంచిది. పాల నుండి వచ్చే కాలుష్యం కంటే 17 రెట్లు మునగాకులో ఉంటుంది. పెరుగునుండి పొందే ప్రోటీన్లు 8 రెట్లు అధికంగా మునగాకు నుండి లభిస్తుంది. ఐదు రకాల క్యాన్సర్లను తగ్గించడంలో మునగాకు అద్భుతంగా పనిచేస్తుంది. థైరాయిడ్ కంట్రోల్ చేయడంలోను, ఏ సీ విటమిన్లు, ఫాస్ఫరస్, ఐరన్ మునగాకుల పుష్కలంగా ఉంటాయి. రక్తహీనతను తగ్గించడంలో మునగాకు ప్రత్యేక పాత్ర వహిస్తుంది. ముఖ్యంగా పాలిచ్చే తల్లులకు మునగాకు వండి పెడితే పాలు అమాంతంగా పెరుగుతాయి అని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు సూపర్వైజర్ కె అంజమ్మ, అంగన్వాడి కార్యకర్త కె కోటేశ్వరమ్మ, గర్భిణులు, తల్లులు 1 నుండి 3 సంవత్సరాల పిల్లలు, 3 నుండి 5 సంవత్సరాల పిల్లలు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకం మరింత నాణ్యంగా ఉండాలి

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఏ భారతి





(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 19)

పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం మరింత నాణ్యంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ,జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్పర్సన్ ఏ భారతి అన్నారు. జిల్లాలోని గిద్దలూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, బాలుర పాఠశాల నందు విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం యొక్క నాణ్యత, పరిశుభ్రతను ఆకస్మిక తనిఖీ సందర్భంగా స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మరింత నాణ్యమైన భోజనం అందించడానికి తగిన సూచనలు చేశారు. వంటశాల నిర్వహణ, శుభ్రత మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ న్యాయమూర్తులు పాల్గొన్నారు.

# ఎంపీ మాగుంటను కలిసిన మైన్స్ అధికారులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 19)

ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని మైన్స్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపిని కలిసిన వారిలో డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ, రాజశేఖర్, అసిస్టెంట్ జియాలజిస్ట్ వర్మ, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్ బాబు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసారు.

# రాళ్లపాడు రిజర్వాయర్‌ను సందర్శించిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 19)

లింగసముద్రం మండలంలో గల రాళ్లపాడు ప్రాజెక్ట్‌ను శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20 అడుగులు కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్ నీటిమట్టం సుమారు 15 అడుగుల నీరు చేరిందని అధికారులు ఎమ్మెల్యేకి తెలియజేశారు. ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ సోమశిల ప్రాజెక్టు నుంచి ఉత్తర కాలువ ద్వారా ఎంత మేర నీరు ప్రాజెక్టులోకి చేరుతుందని అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రాళ్లపాడు ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం మేరకు నీరు చేరిన తర్వాత గేట్లు తెరిచి నీరు క్రింది వైపుకు విడుదల చేయ సందర్భంలో మన్నేరు పరివాహక ప్రాంత గ్రామ ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాళ్లపాడు ప్రాజెక్టు అధికారులు ,తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పులి శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలి

## ఉమ్మడి ప్రకాశం జిల్లా యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు మిరియం, జిల్లా అధ్యక్షులు చిరుమామిళ్ల





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 19)

ఉమ్మడి ప్రకాశం జిల్లా చీరాల నియోజకవర్గం పాపాయపాలెం గ్రామానికి చెందిన యాదవ యువకుడు పులి శ్రీనివాసులు మూడు రోజుల క్రితం అనుమానస్పదముగా మృతి చెందడం జరిగింది. అతడి మరణం పై పోలీసు వారు పూర్తిస్థాయి విచారణ జరిపి నిజ నిజాలు వెలుగులోకి తీసుకురావాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు మిరియం శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు చిరుమామిళ్ల గోపికృష్ణ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీనివాసులు మరణం సహజ మరణం కాదని కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. మరణంపై పోలీసు వారు స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని శ్రీనివాసులు ఆవేదన వ్యక్తపరిచారు. వెంటనే మరణించిన పులి శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు న్యాయం చేకూరే విధంగా పోలీస్ శాఖ వ్యవహరించాలని కోరారు. శ్రీనివాసులు కుటుంబ సభ్యులు ఇది మరణం కాదు హత్య అని అనుమానిస్తున్నా, పోలీస్ వారు పట్టించుకోవట్లేదు అని ఆవేదన చెందుతున్నా పోలీసు ఉన్నతాధికారులు స్పందించకపోవడం దారుణమని శ్రీనివాసులు తెలిపారు. రెండు రోజుల్లో యాదవ జేఏసీ ఆధ్వర్యంలో నిజనిర్ధారణ కమిటీ పాపాయిపాలెం గ్రామానికి వస్తుందని శ్రీనివాసులు తెలిపారు.

# దాసరి లక్ష్మికి అభినందనలు





(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 19)

శనివారం నాడు కొమరోలు మండలం అల్లినగరం శ్రీ మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి సతీమణి దాసరి లక్ష్మి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్య సాంస్కృతిక పలు రంగాలలో మంచి ప్రతిభ కనపర్చిన విద్యార్థులను మరింత ప్రోత్సహించుటకు ముందుకు వచ్చి ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి, ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా దాసరి గురుస్వామి మాట్లాడుతూ మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇలాంటి ప్రోత్సాహక బహుమతులు అందించిన దాసరి లక్ష్మి కి ప్రత్యేక అభినందనలు తెలిపారు. బహుమతులు అందుకున్న విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు బహుమతులు ఏర్పాటు చేసిన దాత దాసరి లక్ష్మికి కృతజ్ఞతలు తెలియజేసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎన్ వి నారాయణ, కోటేశ్వరరావు, సుజాత, ప్రకాశరావు, శివరాం, చంద్రమోహన్, గురువయ్య, అశ్విని దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# జలదిగ్బంధంలో ఒంగోలు




## ఎటు చూసినా వర్షపు నీరే
## జలపాతాన్ని తలపిస్తున్న రహదారులు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 19)**

ఒంగోలులో శనివారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలపాతంలా కనిపించాయి. వర్షాలు దాటికి లోతట్టు ప్రాంతాలు జలమయమవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలకు లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్, కర్నూల్ రోడ్డు, పలు కాలనీలో రోడ్ల పైకి నీరు చేరడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.













## సిసి రోడ్లు పట్టించుకోని అధికారులు
### శుభ్రత విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారులు



**(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 19)**

కంభం మండలంలోని కందులాపురం హాజరత్ గూడెం కంభం గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పలు వీధుల్లో రోడ్ల పరిస్థితి దారుణంగా మారడంతో ప్రజలు ఎంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కంభం గ్రామపంచాయతీకి చెందిన అర్బన్ కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీ కాలవలు లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లల్లోకి వెళ్లడంతో ప్రజలు రోగాలపాలు అవుతున్నారని అక్కడి ప్రజలు అంటున్నారు, ప్రజలకు గూడెం గ్రామ పంచాయతీకి చెందిన హెూండా షోరూం పక్కనే ఉన్న రోడ్డు నడవలేని పరిస్థితికి చేరడంతో స్కూల్లో చిన్నారులకు ఎంతో ఇబ్బందికరంగా ఉందని అక్కడి ప్రజలు మొరపెట్టుకుంటున్నారు. అలాగే కందులాపురం గ్రామపంచాయతీ పరిధిలోని పద్మయ్య కోత మిషన్ సమీపంలో కంభం నుండి అర్ధవీడు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే డంపింగ్ యార్డ్ గా మార్చారు అసలే ప్రజలు జ్వరాలు కొత్త కొత్త రోగాలతో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్న సమయంలో శుభ్రత విషయంలో పంచాయతీ అధికారులు విఫలమయ్యారని అక్కడి స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు ఇప్పటికైనా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రహించి వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## శ్రీ వైష్ణవి ఆధ్వర్యంలో నూతన వెంచర్ ప్రారంభం
### ప్రారంభించిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 19)**

సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం మండలంలో సాయిబాబా గుడి మూడో వీధిలో నూతన వెంచర్ను సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంచర్ ఏర్పాటుచేసిన పోల్బోయిన శ్రీనివాసుల రెడ్డి ఎన్నో కష్టసుఖాలు పడి ఈ వెంచర్ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. 30 అంకణాలు స్థలంలో 16 లక్షల రూపాయలు పెట్టుబడి పెడితే ప్రతి ఒక్కరికి స్థలం కొనుక్కునేందుకు అవకాశం వస్తుందని ఆయన తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు. అంతేకాకుండా ఈ లేఔట్ అన్ని అనుమతులతో సకల సౌకర్యాలు కల్పిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం మండలం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షం నీరు రోడ్డుపైన లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి
### నగరపాలక సంస్థ కమిషనర్ కె వెంకటేశ్వరరావు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 19)**

ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ కె వెంకటేశ్వరరావు శనివారం వర్షం వల్ల రోడ్డుపై నీరు నిలిచిన ప్రాంతాలలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ సిబ్బంది టౌన్ ప్లానింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది వారితో కలిసి పర్యటించారు. ఈ పర్యటన లో భాగంగా మస్తాన్ దర్గా సెంటర్, పాత కూరగాయల మార్కెట్ సెంటర్ బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ,కొత్తపట్నం బస్టాండ్ ప్రాంతాలలో పర్యటించి వర్షపునీరు రోడ్డుపై ఎందుకు ఉన్నదో గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకుని మస్తాన్ దర్గా నుంచి బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వరకు గల ప్రధాన కాలువకు రోడ్డు వైపు నుంచి ఇంకొంచెం ఎక్కువ వీలుగా వర్షపు నీరు పోయే విధంగా తాత్కాలికంగా మిషనరీ ద్వారా ఇప్పుడు ఉన్న ప్రధాన కాలువకు మరి కొన్ని హెూల్స్ వేసి వర్షపునీరు రోడ్డు రోడ్డుపైన లేకుండా ఉండేటట్లు శనివారం రాత్రి నుంచి వెంటనే చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ఇంజనీరింగ్ సిబ్బంది ,శానిటరీ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. దీని కోసం పాత మార్కెట్ సెంటర్ మీదుగా వచ్చే ట్రాఫిక్ ను మళ్లించే దానికి ట్రాఫిక్ డిపార్ట్మెంట్ వారికి రిక్వెస్ట్ చేశారు.అలానే కొత్తపట్నం బస్టాండ్ వద్దగల పెట్రోల్ బంక్ యొక్క ఎంట్రీ , ఎగ్జిట్ మార్గాలలో ఉన్న వర్షపు నీరు పోయే రంధ్రాలను తాత్కాలికముగా ఇంకొంచెం పెద్దవిగా చేసి ఆ ప్రాంతంలో వర్షపు నీరు ఉండకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. మస్తాన్ దుర్గ సెంటర్, పాత కూరగాయల మార్కెట్, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, కొత్తపట్నం బస్టాండ్ ప్రాంతములోనే కాకుండా నగరంలోని ప్రధాన రహదారుల యందు ఎక్కడా కూడా వర్షపునీరు నిలువకుండా కాలువల ద్వారా పోయేటందుకు శాశ్వత ప్రాతిపదికన త్వరలోనే కౌన్సిల్ తీర్మానం తీసుకుని ఆయా ప్రాంతాలలో ఉన్న కాలవల మీద ఉన్న ఆక్రమణలను తొలగించి కాలువలను నిర్మిస్తామని కమిషనర్ కె. వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ తర్వాత అగ్రహారం గేటు దగ్గర రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి సంబంధించిన ప్రదేశాన్ని మేయర్ గంగాడ సుజాతతో కలిసి పరిశీలించి రైల్వే శాఖ కోరిన విధముగా కాలువలలోని నీరు రైల్వే అండర్ బ్రిడ్జిలోనికి రాకుండా కాలువను నిర్మించగలమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిని కలిసి తెలియజేశారు.






## వేడుకగా పల్లె పండుగ కార్యక్రమం
### సిమెంట్ రోడ్డు నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ
### ఎమ్మెల్యే జూలకంటి కి జేజేలు పలికిన ప్రజలు



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 19)**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ వారోత్సవాలు మాచర్ల నియోజకవర్గంలో వేడుకలాగా కొనసాగుతున్నాయి. శనివారం మాచర్ల నియోజకవర్గం పరిధిలోని రెంటచింతల పాల్వాయి గేటు దుర్గి అడిగొప్పల గ్రామాలలో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సిమెంటు రోడ్లకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలోని ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులు పూర్తిగా చిన్న భిన్నమయ్యాయని అన్నారు.

ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొని ప్రశ్నించేందుకే భయపడ్డ రోజుల నుండి సంక్షేమాన్ని అభివృద్ధి చేసుకునే ప్రజా ప్రభుత్వంలో ప్రజలు తమ యొక్క సమస్యలను స్వేచ్ఛగా అధికారులకు ప్రజా ప్రతినిధులకు విన్నవిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలు విన్న ప్రజాప్రతినిధులు అధికారులు సమస్యలు పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. రానున్న రోజుల్లో ఏ ఒక్క గ్రామ పంచాయతీ లో సిమెంటు రోడ్డు లేని గ్రామాలను చూడబోతున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అరకొరగా నిర్మించిన సిమెంటు రోడ్లు డ్రైనేజీ నిర్మాణాలు లేకుండానే చేసి బిల్లులు చేసుకున్న సంఘటనలు చూసామన్నారు. డ్రైనేజీలతో ఏర్పాటు చేస్తున్న సిమెంట్ రోడ్లు ద్వారా మరుగునీరు సక్రమంగా ప్రవహించి దోమల బారిన పడకుండా రోగాల దరిచేరకుండా ఉండే అవకాశం ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేడుకగా పల్లె పండుగ కార్యక్రమం

## సిమెంట్ రోడ్డు నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ

## ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర







(షణ్ముఖ వెలుగు, పామూరు, అక్టోబర్ 19)

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ వారోత్సవాలు పామూరు పట్టణం నందు వేడుకలాగా కొనసాగుతున్నాయి. శనివారం నియోజకవర్గం పరిధిలోని పామూరు పట్టణ నందు లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సిమెంటు రోడ్లకు ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలోని ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులు పూర్తిగా చిన్న భిన్నమయ్యాయని అన్నారు. ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొని ప్రశ్నించేందుకే భయపడ్డ రోజుల నుండి సంక్షేమాన్ని అభివృద్ధి చేసుకునే ప్రజా ప్రభుత్వంలో ప్రజలు తమ యొక్క సమస్యలను స్వేచ్ఛగా అధికారులకు ప్రజా ప్రతినిధులకు విన్నవిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలు విన్న ప్రజాప్రతినిధులు అధికారులు సమస్యలు పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. రానున్న రోజుల్లో ఏ ఒక్క గ్రామ పంచాయతీ లో సిమెంటు రోడ్డు లేని గ్రామాలను చూడబోతున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అరకొరగా నిర్మించిన సిమెంటు రోడ్లు డ్రైనేజీ నిర్మాణాలు లేకుండానే చేసి బిల్లులు చేసుకున్న సంఘటనలు చూసామన్నారు. డ్రైనేజీలతో ఏర్పాటు చేస్తున్న సిమెంట్ రోడ్లు ద్వారా మరుగునీరు సక్రమంగా ప్రవహించి దోమల బారిన పడకుండా రోగాల దరిచేరకుండా ఉండే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరేడు పంచాయతీలో సిసి రోడ్లకు శంకుస్థాపన

## 5 సిసి రోడ్లకు రూ.33.83 లక్షల నిధులు మంజూరు






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 19)

పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ గ్రామ ఉపాధి హామీ పథకం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు సారథ్యంలో ఉలవపాడు మండల పరిధిలోని కరేడు పంచాయతీ పద్మశాలుల బజార్, మెయిన్ విలేజ్, ఎస్సీ కాలనీ, కొత్తపల్లెపాలెం, రోడ్డు బజారు లో శనివారం రూ33 .83 లక్షల రూపాయల వ్యయంతో ఐదు నూతన సిమెంట్ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ రమణమూర్తి కరేడు సర్పంచ్ చేవూరు వెంకటేశ్వర్లు, క్లస్టర్ ఇంచార్జి పోనుబోయినశ్రీనివాసులు, పార్టీ ప్రెసిడెంట్ కన్నా ప్రసాదు, ఆర్. శ్రీనివాస్ తేజ, యం. శ్రీనివాసులు రెడ్డి, కొత్తపల్లిపాలెం-నాయుడు కోటయ్య, జయరాం, ఎస్. వెంకటేశ్వరరావు, యానాది ఎస్సీ కాలనీ- పున్నెపల్లి శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ కెవి రమణ, సెక్రెటరీ భాస్కర్, సచివాలయ సిబ్బంది మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# క్రీడారంగానికి పూర్వ వైభవం తీసుకొస్తాం

## త్వరలో స్పోర్ట్స్ పాలసీలను ప్రకటిస్తాం

## క్రీడారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## మరో 15 రోజుల్లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను ప్రారంభం

## శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు









(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 19)

రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగంపై ప్రత్యేక దృష్టి సారించిందని, గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన క్రీడారంగానికి సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలోని మొఘళ్లపాలెంలో జరుగుతున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నెల్లూరు పట్టణంలోని ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంను శనివారం ఆయన పరిశీలించారు. తొలుత మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జరిగిన పనులను పరిశీలించి డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అధికారులతో ఆయన సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, మరో 15రోజుల్లో ఇండోర్ స్టేడియంను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంను పరిశీలించి నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, దానిలో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి కేవీకేలు, ఇండోర్ స్టేడియంలు, అవుట్‌డోర్ స్టేడియంలు, డీఎస్ఏల పనితీరు, క్రీడారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. 2017లో మాజీ కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు కోరిక మేరకు అప్పటి ప్రభుత్వం 150 ఎకరాల భూమిని మల్టీపర్పస్ క్రీడా వికాస కేంద్రం కేటాయించిందని, రూ.8కోట్లతో నిర్మాణాలను చేపట్టి సుమార్ 90శాతం పనులను కూడా పూర్తి చేసిందన్నారు. కానీ ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం క్రీడారంగాన్ని నిర్వీర్యం చేసిందని, ఐదేళ్లుగా రాష్ట్రంలోని క్రీడావికాస కేంద్రాల నిర్మాణాలు, స్టేడియాల నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి మరో 15రోజుల్లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. 2027లో నేషనల్ గేమ్స్‌ను మన రాష్ట్రంలోనే నిర్వహించాలనే దృఢసంకల్పంతో చంద్రబాబునాయుడు ఉన్నారని, దానికి తగ్గట్టుగానే అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేసేలా క్రీడారంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. స్కూల్ స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించాలని విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఆకాంక్షిస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఆట స్థలాలు లేని 4039 పాఠశాలలను గుర్తించి ఆట స్థలాలు ఏర్పాటు చేసేలా జీవోలను సైతం తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో రూ.119 కోట్లు దుర్వినియోగం చేసిందని, క్రీడారంగాన్ని రాజకీయక్రీడగా మార్చిందన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం క్రీడారంగాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో అనేకమైన స్పోర్ట్స్ పాలసీలు తీసుకొస్తుందని, ఇటీవల 53 క్రీడలకు సంబంధించిన అసోసియేషన్లతో సమావేశం నిర్వహించామన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబు నిర్వహించిన స్పోర్ట్స్ రివ్యూలో పాల్గొన్నామన్నారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించి దేశం గర్వించదగ్గ క్రీడాకారులను తయారుచేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేవీకేలు, ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా క్రీడారంగంలో పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు, ఔత్సాహికులు, మాజీ క్రీడాకారులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మంత్రి లోకేష్ కూడా క్రీడారంగంలో పీపీపీ విధానాన్ని అమలుచేస్తున్నారని దాని కారణంగా క్రీడారంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. క్రీడారంగంలోని సమస్యల పరిష్కారానికి శాప్ కృషి చేయాలని, గత ప్రభుత్వం క్రీడారంగాన్ని పూర్తిగా విస్మరించిందని మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు శాప్ ఛైర్మన్‌గా రవినాయుడుకి బాధ్యతలు అప్పగించడం సంతోషదాయకమన్నారు. నెల్లూరులో ఉన్న ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో సమస్యలను పరిష్కరించి స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మల్టీపర్పస్ ఇండోర్ హాలును కూడా వినియోగంలోకి తీసుకురావాలని శాప్ చైర్మన్‌ను కోరారు. కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూస్థానిక నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం పబ్లిసిటీ పిచ్చితో క్రీడారంగాన్ని పట్టించుకోలేదని, కేవలం ఎలక్షన్ పబ్లిసిటీ కోసం రూ.119కోట్లను ఆడుదాం ఆంధ్రా పేరుతో దుర్వినియోగం చేసిందన్నారు. ఒక్క క్రీడాకారుడిన్ని కూడ వెలికి తీయ లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే క్రీడారంగంపై దృష్టి పెట్టిందన్నారు. గత ఐదేళ్లుగా నిలిచిపోయిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులను మళ్లీ ప్రారంభించిందని, త్వరలోనే క్రీడాకారులకు వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. మల్టీ పర్పస్ స్టేడియం కాంపౌండ్ వాల్, బి . టి రోడ్ కు 3 కోట్లు,డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి 2.5 కోట్లు అవసరం వుందని చైర్ మన్ కు తెలిపారు.క్రీడారంగం అభివృద్ధిపై సీఎం చంద్రబాబు చాలా స్పష్టంగా ఉన్నారని, ఆయన అంచనాలను అందుకునేలా శాప్ అధికారులు, ఉద్యోగులు బాధ్యతా యుతంగా గా పనిచేయాలని శాప్ ఛైర్మన్ అన్నారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో శాప్ ఉద్యోగులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. నెల్లూరు జిల్లాను స్పోర్ట్స్ హబ్‌గా చూడాలనేది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఈ విషయంలో శాప్ ఉద్యోగులు, అధికారులు ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. అనంతరం క్రీడా వికాస కేంద్రాలు, స్టేడియంలు, స్పోర్ట్స్ విలేజీలు, స్పోర్ట్స్ పాలసీలు, పీపీపీ విధానం, సీఎస్ఆర్ ఫండ్స్‌కు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. స్టేడియం అభివృద్ధికి అందరూ సమన్వయం తో పని చేయాలన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి ప్రతి మూడు నెలలకు ఒక సారి సమావేశాలు నిర్వహించి స్టేడియం ను అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్డీఓ ఆర్కే ఎథిరాజులు నెల్లూరు నియోజకవర్గ నాయకులు ,చేజెర్ల వేంకటేశ్వర రెడ్డి ,పలువురునాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు,కొచ్ లు, పాల్గొన్నారు.

# గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు

## మంత్రి ఆనం రామనారాయణరెడ్డి






(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 19)

నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో మర్రిపాడు మండల పార్టీ నాయకులతో విస్తృతస్థాయి సమావేశం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నిర్వహించారు.భారీగా ఆత్మకూరు నియోజకవర్గం మర్రిపాడు మండల నాయకులు, కార్యకర్తలుహాజరయ్యారు.మర్రిపాడు మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సభ్యత్వ నమోదుపై నాయకులు, కార్యకర్తలకు మంత్రి ఆనందిశా నిర్దేశంచేశారు.గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాల మేరకు అభివృద్ధి పనులకు పెద్దపీట వేసామని మంత్రి ఆనం తెలిపారు. తెలుగు దేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం మే 27 నాటికి ఆత్మకూరులో శాశ్వతంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు.కంప్యూటర్లు, అర్జీల నమోదు, డేటా ఎంట్రీ, అర్జీల స్టేటస్... పూర్తిస్థాయిలో జవాబుదారీతనం ఉండేలా కార్పొరేట్ స్థాయిలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.ప్రతి ఒక్క కార్యకర్త కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలి... పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలన్నారు.రెండేళ్ల పార్టీ సభ్యత్వానికి రూ. 100 ఆన్‌లైన్ లోనే చెల్లించాలి. సభ్యత్వం చెల్లించిన ప్రతి ఒక్క కార్యకర్త సంక్షేమానికి పార్టీ కృషి చేస్తోంది. రూ.5 లక్షల బీమా సౌకర్యం ఉందన్నారు.గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులు, ఇరిగేషన్ పనులను మొదలుపెట్టనున్నామన్నారు. నాయకులందరూ గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులను సూచించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సరికొత్త నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా సరికొత్త మద్యం పాలసీని తీసుకొచ్చి, పేదవాడి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన అన్ని బ్రాండ్ల మద్యాన్ని క్వార్టర్ బాటిల్ రూ.99 కే అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నాం..... ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు ఉన్నవారు వ్యక్తిగత అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చు..... ఏ అధికారి కూడా అడ్డుకోరు.... ఎవరైనా అడ్డుకుంటే వారిని సస్పెండ్ చేస్తామని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారన్నారు.ఆత్మకూరు అభివృద్ధితోపాటు జిల్లా సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో కూడా కార్యకర్తలు అందరూ భాగస్వామ్యం కావాలనిమంత్రి ఆనం రామనారాయణరెడ్డితెలిపారు.

# మద్యపానం మీద పెట్టిన దృష్టి

## తిరుమల కొండ పైన చూపించలేదు

## భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర నాయకులు కుమ్మర సత్యనారాయణ యాదవ్



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 19)

భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదములో కల్తీ నెయ్యి కలిపారు అని మన రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చెప్పారు. అయితే మా నాయకుడు బోడే రామచంద్ర యాదవ్ పుంగనూరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేసి అలిపిరి నుంచి తిరుమలకు మెట్ల పూజా కార్యక్రమం చేసి దేవుడు వద్ద అందరం సమానం అని సర్వదర్శనం చేసుకుని వెయ్యి ఆవులు తన సొంత నిధులతో ఇస్తాను, అలాగే లక్ష ఆవులు సేకరిస్తాను, యాదవ కులముకు చెందిన వారికి పదివేల మంది ఉద్యోగాలు గోశాలలో పనిచేయుటకు అవకాశం కల్పించండి అని చెప్పినా ఇంత వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమాధానం ఇవ్వలేదన్నారు. మీరు ఇద్దరూ మద్యపానం మీద పెట్టిన దృష్టి తిరుమల కొండ పైన ఉన్న వెంకటేశ్వర స్వామి మీద ఎందుకు చూపించలేదు, మీకు మీ పార్టీ నాయకులు కోసం మద్యపానం టెండర్లు పెట్టి సామాన్యులు ప్రజల వద్దదండు లక్షలు తీసుకొని వారికి ఆ మద్యపానం వస్తే మీ ఎమ్మెల్యేలు బెదిరించి లాకోవటం తప్ప మీరు ఏమి చేశారు. పవన్ కళ్యాణ్ నేను ప్రజల కోసం ఎంత దూరమైన వస్తానన్నావు. మీ కుట్ర రాజకీయం ఆంధ్రప్రదేశ్ ప్రజలు గడిచిన నాలుగు నెలల్లోనే బాగా అర్థం చేసుకున్నారన్నారు. మీరు ఒక విషయం మీద నిలబడరు అన్న విషయం ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు బాగా అర్థమైంది బహుజన పార్టీ అయినా భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ , తిరుమల లడ్డు ప్రసాదాలను కాపాడుదాం , అంటే మీరు ఇంతవరకు సమాధానం లేదు చంద్రబాబు నువ్వు ప్రజలకు నీతులు బాగా చెప్తావ్ అలాగే నీకు పుంగనూరు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్న సంబంధం ప్రజలకు బాగా అర్థమవుతుంది .నువ్వు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుంగనూరులో పెద్దిరెడ్డికి నువ్వు లోపాయి కార్యక్రమం చేస్తున్న విషయం .ఈ రాష్ట్ర ప్రజలు బాగా అర్థం చేసుకున్నారు. నువ్వు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దొంగకి పక్కదోవన సపోర్ట్ చేస్తున్నావు అన్న విషయం బాగా ఈ రాష్ట్ర ప్రజలు కు అర్థమైంది. నీలాంటి రాజకీయ నాయకులు ఆంధ్రప్రదేశ్ లో పనికిరారని ప్రజలు బాగా అర్థం చేసుకున్నారు రాబోయే రోజుల్లో భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ వెంట నడవటానికి సిద్ధం దమ్మున్న నాయకుడు బోడె రామచంద్ర యాదవ్ నాయకత్వం వర్ధిల్లాలని కోరారు.

# ఆత్మకూరు అభివృద్ధి... భవిష్యత్ తరాల ప్రయోజనమే లక్ష్యం



## పారిశ్రామికంగా ఆత్మకూరు అభివృద్ధికి అపార అవకాశాలు
## నాయకులు, కార్యకర్తల సూచనలతో అభివృద్ధి పనులు
## త్వరలోనే బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ప్రారంభం
## ఆత్మకూరులో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు
## పార్టీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలి
## మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
## అనుమసముద్రంపేట, మర్రిపాడు మండలాల నాయకులతో విస్తృత సమావేశం

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 19)

సోమశిల, హై లెవెల్ కెనాల్, సంగం బ్యారేజ్ సాగునీటి ప్రాజెక్టులు, మూడు జాతీయ రహదారులు, రైల్వే లైను ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలతో ఆత్మకూరు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, అన్ని రంగాల్లో ఆత్మకూరు నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో అనంతసాగరం, మర్రిపాడు మండలాల పార్టీ ముఖ్య నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించిన మంత్రి, గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సభ్యత్వ నమోదుపై నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆత్మకూరు నియోజకవర్గంలో రాబోయే ఐదేళ్లలో పరిశ్రమలు, ఇరిగేషన్ ప్రాజెక్టుల ఏర్పాటు, వివిధ రెసిడెన్షియల్ కళాశాలల ఏర్పాటు, స్కిల్ కళాశాల ఏర్పాటు, నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గొప్ప సంకల్పంతో పనిచేస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఆత్మకూరులో ఈ ఏడాది నుంచి బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని గ్రామపంచాయతీలో ఆలయాల మరమ్మతులకు 5 లక్షల వరకు నిధులు మంజూరు చేస్తామని, నాయకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆలయాల అభివృద్ధికి ముందుకు రావాలన్నారు. రూ 50 వేల లోపు ఆదాయం ఉన్న ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు రూ 10వేలు ఈ నెల నుంచి మంజూరు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులను మొదలుపెట్టనున్నామని, నాయకులందరూ గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులను సూచించాలని చెప్పారు. అలాగే మండలానికి ఒకటిన్నర కోటి రూపాయలు సీసీ రోడ్లకు ఉపాధి హామీ పనులు మంజూరయ్యాయని చెప్పారు. రూ. 5 కోట్లతో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు కూడా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి చెప్పారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ ల పై చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. అలాగే రేషన్ షాప్ దుకాణాల్లో కూడా అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తన అభ్యర్థన మేరకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలోని ప్రతి మండలానికి 50 గోకులాలను మంజూరు చేశారని చెప్పారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాల మేరకు అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రతి ఒక్క కార్యకర్త కూడా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెండేళ్ల పార్టీ సభ్యత్వానికి 100 రూపాయలు ఆన్లైన్ లో చెల్లించాలని, సభ్యత్వం పొందిన ప్రతి ఒక్క కార్యకర్త సంక్షేమానికి పార్టీ భరోసాగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు ఐదు లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. అన్ని మండలాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సభ్యత్వాన్ని పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు.రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారని మంత్రి చెప్పారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సరికొత్త నిర్ణయాలు తీసుకుంటున్నారన్న మంత్రి, పారదర్శకంగా టెండర్ల ద్వారా లాటరీ పద్ధతిలో మద్యం షాపులను కేటాయించామన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా సరికొత్త మద్యం పాలసీని తీసుకొచ్చి..పేదవాడి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన అన్ని బ్రాండ్ల మద్యాన్ని క్వార్టర్ బాటిల్ రూ. 99 కే అందుబాటులో ఉంచుతున్నట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి ఇండస్ట్రియల్ పాలసీని ప్రవేశపెట్టారన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు ఉన్నవారు వ్యక్తిగత అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చు..ఏ అధికారి కూడా అడ్డుకోరు.. ఎవరైనా అడ్డుకుంటే వారిని సస్పెండ్ చేస్తామని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఆత్మకూరు అభివృద్ధితోపాటు జిల్లా సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో కూడా కార్యకర్తలు అందరూ భాగస్వామ్యం కావాలని మంత్రి పిలుపునిచ్చారు. అనంతరం సభ్యత్వ నమోదు ప్రక్రియపై పార్టీ పరిశీలకులు కార్తీక్ పార్టీ నాయకులకు వివరించారు. ఈ సమావేశంలో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, రాష్ట్ర పార్టీ పరిశీలకులు సుఖవాసి శ్రీనివాస్, స్థానిక నాయకులు బొల్లినేని గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ భూములకు రక్షణ కల్పించాలి

## ఎస్సీ, ఎస్టీ భూముల కబ్జాదారుల పై ఎస్సీ, ఎస్టీఅట్రాసిటీ కేసులు నమోదు చేయాలి
## దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చప్పిడి వెంగళరావు, అంబేద్కర్ ఆశయ సమాజ్ జాతీయ అధ్యక్షులు దండేల కృష్ణలు డిమాండ్



(షణ్ముఖ వెలుగు, చీరాల, అక్టోబర్ 19)

దళిత, గిరిజన భూముల సమస్యలపై మాల మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండమూరి ప్రకాశ్ అధ్యక్షతన దళిత సంఘాల ఐక్య వేదికఆధ్వర్యంలో తేది.19-10-2024న స్థానిక చీరాల పేరా లోని సంఘము కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చప్పిడి వెంగళరావు, అంబేద్కర్ ఆశయ సమాజ్ జాతీయ అధ్యక్షులు దండేల. కృష్ణ లు సంయుక్తంగా మాట్లాడుతూబాపట్ల జిల్లా లో దళిత, గిరిజన భూములు కబ్జా కు గురవుతున్నా, అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారని తీవ్రంగా ఖండిస్తూ అన్నారు.పాలకులు మారినా దళిత, గిరిజనుల పట్ల వేధింపులు మారలేదని అన్నారు. ఎస్సీ,ఎస్టీ కాని ఇతరులు ఎస్సీ,ఎస్టీ భూముల పై నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి,ఎస్సీ,ఎస్టీలను తమ భూముల లోనికి రానివ్వకుండా, అడ్డు కుంటూ అండ బలం, ధన బలం ఉపయోగించి ఎస్సీ,ఎస్టీభూ ములకు సంబంధించి స్వాధీన హక్కు దారులను సాగులోనికి రానివ్వ కుండా చేస్తున్నారని, మా సంఘం దృష్టికి ఈ చీరాల నియోజక వర్గ ంలో అనేక పిర్యాదులు వచ్చాయని అన్నారు. మా దృష్టికి వచ్చిన పిర్యాదులు పై సోమవారం జాయింట్ కలెక్టర్ గారి గ్రీవెన్స్ లో పిర్యాదు చేయబోతున్నామని అన్నారు.తక్షణమే రెవిన్యూ అధికారులు ఎస్సీ,ఎస్టీ భూములకు రక్షణ కల్పించి,ఎస్సీ,ఎస్టీ భూముల కబ్జా దారుల పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదుకు పోలీస్ వారికి ఆదేశాలు ఇచ్చి ఎస్సీ,ఎస్టీలకు మనోధైర్యం కల్పించాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో మాల మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండమూరి ప్రకాశ్ , మాల భేరి యువజన విభాగం జాతీయ అధ్యక్షులు చప్పిడి ప్రీతం, మాల మహానాడు రాష్ట్ర నాయకులు మే డికొండ. మురళి , అంబేద్కర్ యూత్ నాయకులు పాల్గొన్నారు.

# నెల్లూరులోనూ టీడీపీ కూటమి నేతల దందా

## రూ.100 కోట్ల ఇసుక దోపిడీకి సోమిరెడ్డి స్కెచ్
## దీని పై నెల్లూరులో ఈనెల 25న ధర్నా
## మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 19)



ఇసుక, మద్యం విషయాల్లో జోక్యం చేసుకుంటే సహించను అని చంద్రబాబు తన సొంత పార్టీ నేతలకు జారీ చేస్తున్న హెచ్చరికల్లో నిజంగా చిత్తుశుద్ధి ఉంటే, ఇప్పటి వరకు వివిధ జిల్లాల్లో బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలు, బ్లాక్‌మెయిల్ చేసిన ఎమ్మెల్యేలు, మంత్రులపై ఎందుకు కేసులు నమోదు చేయలేదని నెల్లూరు జిల్లా వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ విషయంలో చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఇసుక, మద్యం వివాదాల్లో ఉన్న ఎంత మంది ఎమ్మెల్యేలు, మంత్రులపై కేసులు నమోదు చేశారు.ఎంత మందిపై చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు మాటలకు అర్థాలే వేరు అన్న కాకాణి.. తమ పార్టీ వారెవ్వరూ ఇసుక, మద్యం జోలికి పోవద్దని చంద్రబాబు చెప్పాడంటే.. ఇష్టారాజ్యంగా దోచుకోమని వారికి చెప్పినట్లే అని స్పష్టం చేశారు. కూటమి ఈ నాలుగు నెలల పాలనంతా యథేచ్ఛగా దోచుకో తినుకో పంచుకో (డీపీటీ) అని మాజీ మంత్రి ఆక్షేపించారు. ఇసుక, మద్యం పాలసీల్లో అంతా గోల్‌మాల్ అన్న ఆయన, ప్రభుత్వ మాటలకు, చేతులకు ఎక్కడా పొంతన లేదని, ఇసుక మొత్తం దోచుకున్నాక సీనరేజ్ రద్దు అని ప్రకటించారని దుయ్యబట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇసుక ధర వేలల్లో ఉండగా, సీనరేజ్ రద్దుతో కేవలం పదుల్లోనే ఊరట కలుగుతుందని తెలిపారు. ఇసుకలో రూ.800 కోట్ల ఆదాయానికి గండి కొట్టిన కూటమి నేతలు, ఎక్కడికక్కడ యథేచ్ఛగా దోపిడి చేశారని అన్నారు. నెల్లూరులోనూ కూటమి నేతల దందా కొనసాగుతోందన్న కాకాణి, స్థానిక సూరాయపాలెం ఇసుక రీచ్‌లో రూ.100 కోట్ల ఇసుక దోపిడీకి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్కెచ్ వేశారని ఆరోపించారు. జిల్లాలోని నాలుగు ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలకు టన్ను ఇసుకకు రూ.114.90 నిర్ణయిస్తే, రూ.36 కే చేస్తామని టెండర్లు వేయడం వెనుక రీచ్‌లను తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు చేసిన కుట్ర కాదా అని నిలదీశారు. ఇసుక రీచ్‌లకు దాఖలైన టెండర్ల నుంచి లాటరీ ద్వారా కాంట్రాక్ట్ ఖరారు. చేయాలన్న నిబంధనను మంత్రి నారాయణ ఒత్తిడి మేరకు కలెక్టర్ బేఖాతర్ చేస్తూ, ఎమ్మెల్యేల అనుచరులకు తిరిగి కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వీటన్నింటిపై ఈనెల 25న ధర్నా చేస్తామని కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రకటించారు.

# మునగాకు పై అవగాహన

## సెక్టార్ సూపర్వైజర్ యం నాగలక్ష్మి

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 19)



ఐసిడిఎస్ కరేడు ఇందిరానగర్ అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులకు, తల్లులకు, పిల్లలకు మునగాకుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మండల పరిధిలోని కరేడు ఇందిరా నగర్ అంగన్వాడి కేంద్రంలో శనివారం సెక్టార్ సూపర్వైజర్ యం. నాగలక్ష్మి ఆధ్వర్యంలో గర్భవతులకు, తల్లులకు, పిల్లలకు మునగాకుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మాట్లాడుతూ మునగాకు తీసుకోవడం అనేది మన శరీర ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా చాలా మంచిది 100 గ్రాములు మునగాకులు 6750 మైక్రోగ్రాముల ఫీచర్ కొరిటిన్ ఉంటుంది ఇది శరీరంలోకి వెళ్లి విటమిన్ ఏ గా తయారవుతుంది. అందుకే కంటి చూపులు మెరుగుపరచడానికి మునగాకు చాలా మంచిది. పాల నుండి వచ్చే కాలుష్యం కంటే 17 రెట్లు మునగాకులో ఉంటుంది. పెరుగునుండి పొందే ప్రోటీన్లు 8 రెట్లు అధికంగా మునగాకు నుండి లభిస్తుంది. ఐదు రకాల క్యాన్సర్లను తగ్గించడంలో మునగాకు అద్భుతంగా పనిచేస్తుంది. థైరాయిడ్ కంట్రోల్ చేయడంలోను, ఏ సీ విటమిన్లు, ఫాస్ఫరస్, ఐరన్ మునగాకుల పుష్కలంగా ఉంటాయి. రక్తహీనతను తగ్గించడంలో మునగాకు ప్రత్యేక పాత్ర వహిస్తుంది. ముఖ్యంగా పాలిచ్చే తల్లులకు మునగాకు వండి పెడితే పాలు అమాంతంగా పెరుగుతాయి అని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో కరేడు సూపర్వైజర్ యం నాగలక్ష్మి, అంగన్వాడి కార్యకర్త డి తిరుపతమ్మ, గర్భవతులు, తల్లులు 1 నుండి 3 సంవత్సరాల పిల్లలు, 3 నుండి 5 సంవత్సరాల పిల్లలు పాల్గొన్నారు.

# వరద బాధితులకు అన్నదానం కార్యక్రమం







(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 19)

సీయోను క్రైస్తవ ప్రార్థన మందిరం పాస్టర్ రూబేన్ ఆధ్వర్యంలో కనిగిరి లోనీ పొగాకు బోర్డు వెనకాల కొండ ప్రాంతంలోపూరిళ్లలోఉంటున్న 80 మంది కుటుంబాలు వర్షాల కారణంగా ఇబ్బందులు పడడంతో సీయోను క్రైస్తవ ప్రార్థన మందిరం పాస్టర్ బలసాని రూబేన్ ఆధ్వర్యంలో దాతలు ఆలూరి మరియమ్మ , వారి కుటుంబం సహకారంతో ఈ 80 కుటుంబాలకు భోజనాలు ఏర్పాటు చేసి పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, పాస్టర్లు పాల్గొన్నారు.

# జనవాణి కార్యక్రమం




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 19)

గోమతి నగర్‌లోని నెల్లూరు జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో గత మూడు వారాలుగా ప్రతి బుధవారం, శనివారం ప్రజలు సమస్యల గూర్చి అర్జీలు స్వీకరిస్తూ జనవాణి కార్యక్రమం జరుగుతున్న సంగతి విదితమే. జనసేన నాయకులు వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కార మార్గాలను చూపుతున్నారు. నెల్లూరు జిల్లా గోమతి నగర్ కార్యాలయంలో నిర్వహించబడుతున్న జనవాణికి విశేష స్పందన లభిస్తుంది. శనివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించిన జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక జనవాణిని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు.

# గుంతలమయంగా నాయుడుపేట రోడ్లు



(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, అక్టోబర్ 19)

నాయుడుపేట పట్టణం పాత ట్రెజరీ వీధిలోని ప్రధాన రహదారిపై నిత్యం ట్రాఫిక్తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల మయంగా మారిన ఈ రహదారిపై పలు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించాలని వారు కోరారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

## ఎంపీ మాగుంటను కలిసిన కేంద్రీయ విద్యాలయ వైస్ ప్రిన్సిపల్ మహేష్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 19)**
ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని కేంద్రీయ విద్యాలయ వైస్ ప్రిన్సిపల్ మహేష్ కుమార్ ముందోటి, రిటైర్డ్ ప్రిన్సిపల్ బి సూర్య ప్రకాష్‌రావు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ ఓవి సాయికిరణ్, మర్యాదపూర్వకంగా కలిశారు. స్కూలు సమస్యల గురించి చర్చించారు.

## చెక్ డ్యాముల నిండా నీరు






**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, అక్టోబర్ 19)**
రిలయన్స్ ఫౌండేషన్, సార్డ్స్ వారి సహకారంతో హనుమంతునిపాడు మండలంలోని లింగంగుంట్ల, మహమ్మదాపురం మరియు గాయంవారిపల్లి గ్రామాలలో మూడు చెక్ డ్యాములు నిర్మించడం జరిగినది. లింగం గుంట్ల గ్రామంలో గంగులయ్య కుంట కట్టను విస్తరించి బలోపేతం చేయడం జరిగింది. గతంలో ఈ గ్రామాలలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉండేది భూగర్భ జలాల అడుగంటి బోరు బావులు ఎండిపోయి రైతులు పంటలు సరిగా పండించలేకపోయేవారు. కానీ రిలయన్స్ ఫౌండేషన్ మరియు సాడ్స్ సంస్థ వారు ఈ గ్రామాలలో చెక్ డాములు నిర్మించడం, కుంటలు విస్తరింపజేసి కట్టలు బలోపేతం చేయడం వలన వర్షపు నీరు ఎక్కువగా నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరిగి ఆయా గ్రామాల్లో రైతులు బోరుబావులకు సమృద్ధిగా నీరు వస్తున్నదని మిరప, నిమ్మ, పొగాకు పండించే రైతులు సంతోషం వ్యక్తం చేయడం జరిగినది. రిలయన్స్ ఫౌండేషన్ మరియు సార్డ్స్ సంస్థ వారికి ఈ గ్రామాల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సహకరించిన మన్నేపల్లి కార్తీక్



**(షణ్ముఖ వెలుగు, పామూరు, అక్టోబర్ 19)**
చంద్రశేఖర్ పురం టిడిపి నాయకులు మన్నేపల్లి శ్రీనివాసులు కుమారుడు మన్నెపల్లి కార్తీక్ కనిగిరి ప్రభుత్వ హాస్పిటల్ అభివృద్ధికి తనదైన సహాయంతో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతులకు మీదుగా 25వేల రూపాయలు సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కనిగిరి టిడిపి నాయకులు, చంద్రశేఖరపురం టిడిపి నాయకులు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## విన్నమాల పంచాయతీలో సీసీ రోడ్లు ప్రారంభం



**(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, అక్టోబర్ 19)**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ మాట ప్రకారం సూళ్లూరుపేట నియోజకవర్గం ఇన్చార్జి నెలవలసుబ్రహ్మణ్యం మాట ప్రకారం ఎమ్మెల్యే నెలవల్లవిజయ్ శ్రీ ఆధ్వర్యంలో విన్నమాల పంచాయతీలు సిసి రోడ్లు ప్రారంభించారు.

# ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి







**(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, అక్టోబర్ 19)**
ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని గొట్లగట్టు, పెదారికట్ల, సిద్దవరం గ్రామలలో పల్లె పండుగ కార్యక్రమామంలో శనివారం ఆయన పాల్గొన్నారు. మొదటగా సిసి రోడ్డుకు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం తో పార్టీ నాయకులు, అధికారులు కొత్త ఉత్సాహంతో పాల్గొని పల్లెల్లో పండుగ వాతావరణం తీసుకొచ్చారని కొనియాడారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 85 కిలోమీటర్ల సిసి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశామని, వైసిపి ప్రభుత్వం పూర్తిగా అభివృద్ధిని పక్కన పెట్టి వైసిపి నాయకులు సంపాదనపై దృష్టి పెట్టారని అన్నారు. వచ్చే మూడు నెలల కాలంలో నియోజకవర్గంలో దాదాపు 30 కిలోమీటర్ల మేర సిసి రోడ్లు వేయను అని, ఇదే మండలంలోని గుడ్డపల్లి గ్రామాన్ని మొదటిగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని తదనంతరం అన్ని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దరమే లక్ష్యంగా పనిచేస్తానని ప్రజలకు మాట ఇచ్చారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్ (బూన్), మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రామిరెడ్డి, మాజీ ఏఎంసి ఛైర్మన్ చప్పిడి రామలింగయ్య, చౌదరి, మండల అధికారులు, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొట్టేపాలెం గ్రామంలో రూ.20 లక్షల నిధులతో కమ్యూనిటీ షెల్టర్ కు శంకుస్థాపన చేసిన టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 19)**
నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని పొట్టేపాళెం గ్రామంలో పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి,పొట్టేపాలెం గ్రామంలో 20 లక్షల రూపాయల నిధులతో కమ్యూనిటీ షెల్టర్ల పనులకు టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిశంకుస్థాపన చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వారం రోజులపాటు పల్లె పండగ కార్యక్రమం జరుగుతుంది . నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18 గ్రామాల్లో 2 కోట్ల రూపాయల నిధులతో రోడ్లు,డ్రెయిన్లు , మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తున్నామన్నారు.నెల్లూరు రూరల్ నియోజవర్గ అభివృద్దే లక్ష్యంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పనిచేస్తున్నారు. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి భవిష్యత్తులో నెల్లూరు రూరల్ నియోజకవర్గం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయటమే మా జెండా - అజెండా. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, టిడిపి నాయకులు ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, ఇందుపూరు ఉదయ్ రెడ్డి, ఎం.పీ.పీ. బూడిద విజయ్ కుమార్ యాదవ్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ షేక్ అల్లా భక్షు, సర్పంచ్ ఏడుకొండలు, ఎంపీటీసీ నేరెళ్ళ నారాయణ, ఎం.పి.డి.ఓ. శైలేంద్ర కుమార్,పంచాయతీ రాజ్ ఈ. ఈ. సుబ్బరాజు, పొన్నాల రామచంద్రా రెడ్డి, హరి యాదవ్, జనని బాబు, సురేష్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సుబ్రమణ్యం, బాలకృష్ణ, పెంచలయ్య, ఫిరోజ్, నరసయ్య, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్వారెడ్డి కండ్రిక గ్రామంలో పల్లె పండుగ

### రూ.9 లక్షల సీసీ రోడ్స్ కు భూమి పూజ



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, అక్టోబర్ 19)**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం సర్వారెడ్డి కండ్రిక గ్రామంలో శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సర్వారెడ్డి కండ్రిక గ్రామంలో 9 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్ నిర్మాణం భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుజ్జయ్య , సూళ్లూరుపేట రూరల్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు ముత్యం ప్రసాద్, సూళ్లూరుపేట మండల కో ఆపరేషన్ నెంబర్ వెల్తూర్ సుకుమార్, పంచాయతీ సెక్రెటరీ ప్రభాకర్, ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యనారాయణ సచివాలయం సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటస్వామి , అంగన్వాడి టీచర్ సురేఖ, మరియు గంపల రవి, ఎన్వి కండ్రిగ, యువ నాయకుడు శీను, సత్యవేటి చెంగయ్య, సుబ్బయ్య, చంటి, గ్రామస్తులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంక దినకర్‌కు శుభాకాంక్షల వెల్లువ



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, అక్టోబర్ 19)**
ఆంధ్రప్రదేశ్ వెలగమూడి సచివాలయం నందు 20 సూత్రాల కమిటీ చైర్మన్‌గా నియమితులైన లంక దినకర్‌ని పలువురు ఛైర్మన్‌లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో ఏపీ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సీడాప్ చైర్మన్ చైర్మన్ గుణపాటి దినకర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ చైర్మన్ శివశంకర్‌లు ఉన్నారు.

## పేకాట ఆడుతున్న వారి పై ఎస్ఐ రమేష్ బాబు దాడులు

**(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, అక్టోబర్ 19)**
మండలంలోని చిమట గ్రామంలో పేకాట ఆడుతున్న వారి పై పోలీసులు దాడులు చేసి ఎనిమిది మందిని ఎస్ఐ రమేష్ బాబు అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న రూ.72,170ల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## మా సమస్యలు పరిష్కారం చేయండి



**(షణ్ముఖ వెలుగు, వెంకటగిరి ఇన్చార్జి, అక్టోబర్ 19)**
స్కూల్ స్వీపర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వారికి కనీస వేతనం ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని , ఉద్యోగ భద్రత కల్పించాలని అలాగే వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ వారి రాష్ట్ర కమిటీ ధర్నాలకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 21వ తేదీ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఎంఈఓ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాల విషయాన్ని వెంకటగిరి ఎంఈఓకి సిఐటియు నాయకులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డీపల్లి చెంగయ్య, నాయకులు ఎస్ ప్రసాద్, పి సుబ్రహ్మణ్యం, సిహెచ్ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గుత్తిగొండ వారిపాలెంలోని డంపింగ్ యార్డును సందర్శించిన కమిషనర్ కోడూరు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 19)**
నగరపాలక సంస్థ పరిధిలోని గుత్తిగొండ వారి పాలెం లో ఉన్న డంపింగ్ యార్డును సందర్శించడం జరిగిందని ఒంగోలు నగరపాల సంస్థ కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు తెలిపారు. గతంలో డంపింగ్ యార్డుకు సంబంధించినటువంటి చెత్తను శుద్ధిచేసి అక్కడ ఎలాంటి చెత్త లేకుండా చేసేందుకు గుంటూరు సంబంధించినటువంటి వారికి కెనడా ఇవ్వడం జరిగిందని వారు సక్రమంగా జరగలేదని ఫిర్యాదు రావడంతో పరిశీలించామని అన్నారు. అయితే ఒంగోలు నగర పరిధిలోని రోజుకి 100 టన్నులు పైన చెత్త వస్తుందని తెలిపారు. నగరంలో నుంచి సేకరించిన చెత్తను ఒక్కసారిగా డంపు చేయటంతో పెద్ద ఎత్తున పేరుకుపోయిందని దానిని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు సహకారంతో చెత్త నుంచి సంపద తయారు చేసే విధంగా తడి చెత్త పొడి చెత్త విధానాన్ని త్వరలో తీసుకు రావడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని అన్నారు. రీజనల్ డైరెక్టర్‌తో సమావేశం జరిగిన అనంతరం ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని అక్కడ వ్యర్ధపదార్థాలు లేకుండా పూర్తిస్థాయిలో నివారించేందుకు చర్యలు చేపడతామని ఆ ప్రాంతంలో మంచి వాతావరణం నుండి విధంగా చర్యలు తీయబడుతున్నామని ఆయన తెలిపారు. నగరపాలక సంస్థకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు కూడా తీసుకువెళ్లి అక్కడ పరిశీలించామని అన్నారు.

## పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి అకాల మృతి



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 19)**
రాపూరు సమితి మాజీ అధ్యక్షులు, రాపూరు మండల పరిషత్ అధ్యక్షులుగా సేవలందించిన పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి అనారోగ్యంతో హైదరాబాదులో శనివారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. దశాబ్దాల పాటు జిల్లా రాజకీయాలలో కొనసాగిన ఆయన రాపూరు మండలంలో మంచి పట్టున్న నేతగా మంచి పేరును సంపాదించుకున్నారు. నాటి రాపూరు, నేటి వెంకటగిరి నియోజికవర్గాల నుండి పోటీ చేసే ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపులో కీలకంగా వ్యవహరించేవారు. మాజీ ఎమ్మెల్యే నువ్వుల వెంకటరత్నం నాయుడుతో ఎంతో సన్నిహితంగా ఉండేవారు. వెంకటరత్నం నాయుడు పోటీ చేసి గెలిచిన ప్రతిసారి పాపకన్ను రాజశేఖరరెడ్డి సహకారం ఉండేది. 2009లో వెంకటగిరి ఎమ్మెల్యేగా తొలిసారి పోటీ చేసిన కునుగుండ్ల రామకృష్ణ గెలుపులో ఆయన కృషి మరవలేనిదంటారు. కాంగ్రెస్, టిడిపిలో కొనసాగిన రాజశేఖర్‌రెడ్డి 2013లో వైసీపీలో చేరారు. ప్రస్తుతం వైసీపీ సీనియర్ నేతగా ఉన్నారు. పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి సోదరి మనీ మంజిన్‌ని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి వివాహం చేసుకోవడంతో పాపకన్ను, మేకపాటి కుటుంబాలు వియ్యంకులయ్యారు. అయితే గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో హైదరాబాద్ నగరానికి పరిమితమైన ఆయన శనివారం సాయంత్రం కన్నుమూశారు. ఆదివారం మధ్యాహ్నం నెల్లూరులోని ఆయన స్వగృహంకు పార్థివ దేహాన్ని తీసుకొస్తారు. సోమవారం ఉదయం రాపూర్, వేపినాపి గ్రామంలో అంతిమయాత్ర నిర్వహిస్తామని పాపకన్ను కుటుంబ సభ్యులు తెలిపారు.